www.prajajwalanews.com

# ప్రజాజ్వాల

తెలుగు దినపత్రిక

ప్రజాజ్వాల
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును
చీఫ్ ఎడిటర్ మాదగాని సుగ్రీవుడు, 9441284503

ఆదివారం | 30-11-2025 | సంపుటి: 15 | సంచిక: 161 | పేజీలు : 8 | వెల : 4/- | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# తెలంగాణ ఆవిర్భావ పోరాటానికి అడ్డు కాంగ్రెస్సే

తెలంగాణకు ప్రధాన విఘాతశక్తిగా కేటీఆర్ విమర్శ

బీఆర్ఎస్ దీక్షా దివస్ కార్యక్రమంలో కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన కేటీఆర్

"ఉద్యమ రక్తంతో ముద్దాడినచరిత్ర కాంగ్రెస్సుదే" అంటూ మండిపాటు

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ దాడులే జరుగుతున్నాయన్న ఆరోపణ

ఢిల్లీ-గుజరాత్ శక్తులకు వశంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం అని వ్యాఖ్య

తెలంగాణ సిద్ధాంతాన్ని మళ్లీ బలోపేతం చేస్తామని హామీ

హైదరాబాద్, నవంబర్ 29: తెలంగాణ ఆవిర్భావ పోరాటానికి అడ్డుగా నిలిచిన శక్తి ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్‌నేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ఆకాంక్షలను ముంచెత్తిన పార్టీగా కాంగ్రెస్‌ను ముద్ర వేశారు. ఉద్యమ కాలంలో తెలంగాణ యువత, విద్యార్థుల ప్రాణాలు బలయ్యేలా రాజకీయ ప్రయోజనాలు చూసిన పార్టీ కాంగ్రెస్‌నేనని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యమ నాయకత్వాన్ని అణచివేయడానికి ఆ పార్టీ అనేక వేషాలేసిందని అన్నారు. ఉద్యమ కాలంలోని పాత్ర ఏమిటో కూడా స్పష్టత లేని కొంతమంది నేతలు ఈరోజు ఉద్యమ పురాణాలు చెబుతున్నారనడం ఆయన వ్యాఖ్య. రాష్ట్ర జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష్యంగా చేసుకుని ప్రణాళికాబద్ధంగా అపప్రథలు సృష్టిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జలాల ప్రవాహం నిలిచిపోవడానికి విపక్షాలే కారణమని, ప్రజా ప్రయోజనం కంటే రాజకీయ లాభాలు మించి కనిపిస్తున్నాయని విమర్శించారు. ఇప్పుడు జరుగుతున్న పాలన పూర్తిగా బాహ్య శక్తుల ఆధిపత్యంలో ఉందన్నారు. నెలలో ఎన్నోసార్లు ఢిల్లీ ధవళభవనాలు తిరిగొచ్చే నాయకత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టలేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటులో

(మిగతా 2వ పేజీలో)

# చివరిరోజు నామినేషన్ల వెల్లువ

## శుభముహూర్తం ప్రభావంతో శనివారం భారీగా అభ్యర్థుల రద్దీ

రాత్రి వరకూ కొనసాగిన దాఖలు ప్రక్రియ.. మొదటి విడత ముగింపు, ఇవాళ నుంచి రెండో విడత

సర్పంచ్, వార్డు స్థానాలకు పదివేలల్లో నామినేషన్లు.. పరిశీలన, అప్పీలు-ఉపసంహరణకు షెడ్యూల్ సిద్ధం





బస్సు ప్రమాదాలపై ఎన్ హెచ్చార్సీ స్పందన

# రాష్ట్రాలకు కీలక ఆదేశాల జారీ

నిబంధనలకు అనుగుణంగాలేని బస్సులను పక్కన పెట్టాలని ఆదేశం

వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో ప్రజల్లో భయాందోళనలు

ప్రయాణికుల ఫిర్యాదులతో స్పందించిన మానవ హక్కుల కమిషన్

# భవిష్యత్ విద్యుత్ అవసరాలే కొత్త ప్రాజెక్టుల లక్ష్యం

విద్యుత్‌పై విపక్షాల ఆరోపణలు ఆధారరాహితం: డిప్యూటీ సీఎం భట్టి

మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యానికి శక్తి రంగమే మూలస్తంభం

2034-35 నాటికే భారీ డిమాండ్-లోటు ఉద్భృతం అవనున్నదని అంచనా

థర్మల్ ఆధారాన్ని పెంచకపోతే గ్రిడ్ ప్రమాదంలో పడే అవకాశం

సంప్రదాయేతర ఇంధన ప్రణాళికల్లో పూర్వ ప్రభుత్వ నిర్లక్ష్యం

పారదర్శక టెండర్లతోనే కొత్త థర్మల్ యూనిట్లు ప్రారంభం

విరుద్ధ ప్రచారం రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే



హైదరాబాద్, నవంబర్ 29: రాష్ట్ర విద్యుత్ రంగంలో కొత్త ప్రాజెక్టులు కేవలం భవిష్యత్ అవసరాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయాలేనని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వేల కోట్ల అవినీతి కోసం విద్యుత్ యూనిట్లు ప్రణాళికలో పెట్టారన్న బీఆర్ఎస్ ఆరోపణలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని ఆయన తేల్చిచెప్పారు. ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం పవర్‌పాయింట్‌తో వివరాలు వెల్లడించారు. "2047 నాటికి రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల అంతర్జాతీయ ప్రమాణాల జీడీపీ స్థాయికి తీసుకెళ్లాలంటే శక్తి రంగం స్థిరంగా, నిరంతరాయంగా ఉండాలి" అని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుతం తలసరి విద్యుత్ వినియోగం 2,349 యూనిట్లు కాగా, అమెరికా, జపాన్, చైనా వంటి దేశాలతో సమానస్థాయికి చేరడమే లక్ష్యమని చెప్పారు. సీఈఏ అంచనాల ప్రకారం రాష్ట్ర విద్యుత్ డిమాండ్ ప్రతి సంవత్సరం వేగంగా పెరుగుతుందని ని

(మిగతా 2వ పేజీలో)

# విద్యుత్ గణాంకాల్లో గందరగోళం

## ::: డిప్యూటీ సీఎంపై హరీశ్‌రావు విమర్శలు

విద్యుత్ శాఖ డేటాపై భట్టి విక్రమార్క తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ ఆరోపణ

శ్వేతపత్రం-క్లీన్ అండ్ గ్రీన్ పాలసీలో గణాంకాలు విరుద్ధంగా ఉన్నట్లు ఆరోచన

సోలార్ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీపై ప్రభుత్వ లెక్కల్లో స్పష్టత లేకపోవడంపై ప్రశ్నలు



హైదరాబాద్, నవంబర్ 29: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ శాఖపై చేసిన ప్రజంటేషన్‌లో గణాంకాలు పరస్పర విరుద్ధంగా ఉండడం, వాస్తవాలకు దూరంగా ఉండడం ఆందోళన కలిగించే విషయం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు విమర్శించారు. రెండు సంవత్సరాలుగా శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ వివరాలను సరిగ్గా అర్థం చేసుకోకపోవడం

(మిగతా 2వ పేజీలో)



# అధిష్ఠానం మాటే మా నిర్ణయం

::: సిద్ధరామయ్య-డీకే ఐక్య ప్రకటన

సీఎం, డిప్యూటీ సిఎం భేటీతో నాయకత్వ వివాదానికి ముగింపు సంకేతాలు

హైకమాండ్ నిర్ణయానికి ఇద్దరూ కట్టుబడి ఉంటామని స్పష్టీకరణ

వచ్చే ఎన్నికల వ్యూహంపై ప్రధాన చర్చ

బీజేపీ-జేడీఎస్ ఆరోపణలు రాజకీయ ప్రజ్ఞాపూర్వకమని విమర్శ

# జంపింగ్ పాలిటిక్స్‌తో కొంతకాలమే బాగుంటుంది

యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్

యూత్ నాయకులు గ్రౌండ్‌లో పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని సూచన

కాంగ్రెస్‌లో అవకాశాలు ఉంటాయని వ్యాఖ్య



# ఫిరాయింపుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటే: కిషన్‌రెడ్డి

ప్రజాతీర్పును వక్రీకరించే ప్రయత్నాల్లో 2 పార్టీల ఔత్సాహ్యం సమానమని ఆరోపణ

బీసీల హక్కులను కాంగ్రెస్-బీఆర్ఎస్ ఇద్దరూ దెబ్బతీశారని కేంద్రమంత్రి వ్యాఖ్య

బిహార్‌ను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ చేసిన రిజర్వేషన్ వాగ్దానాలు అమలుకాలేదన్న విమర్శ

బీసీ జనాభా లెక్కలు మార్చి అన్యాయం చేసినవారికి మాట్లాడే హక్కులేదని ఫైర్

గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను బీజేపీ ఎదిరిస్తుందని స్పష్టం

త్వరలో ప్రధాని వరంగల్ పర్యటనకు వస్తారని సంకేతాలు

ఫిరాయింపులకు ప్రోత్సాహమే 2 పార్టీల ధోరణి



వరంగల్ : పార్టీ మార్పులను ప్రోత్సహించి ప్రజా అభిమతాన్ని కాలరాస్తున్న విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే తీరు అవలం బిస్తున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. వరంగల్ పర్యటనలో మీడియాతో మాట్లాడిన ఆయను "బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను

(మిగతా 2వ పేజీలో)

# చివరిరోజు నామినేషన్ల వెల్లువ

**శుభముహూర్తం ప్రభావంతో శనివారం భారీగా అభ్యర్థుల రద్దీ**

**రాత్రి వరకూ కొనసాగిన దాఖలు ప్రక్రియ..**

**మొదటి విడత ముగింపు, ఇవాళ నుంచి రెండో విడత**

**సర్పంచ్, వార్డు స్థానాలకు పదివేలల్లో నామినేషన్లు.. పరిశీలన, అప్పీలు-ఉపసంహరణకు షెడ్యూల్ సిద్ధం**



గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికల నామినేషన్ల దాఖలు గడువు ముగిసిన శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అపూర్వమైన స్పందన నమోదైంది. గత రెండు రోజులుగా ఆశించినంతగా నామినేషన్లు రాకపోయినా, చివరి రోజున అభ్యర్థుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు క్యూలో నిలిచిన వారికి టోకెన్లు ఇచ్చినందున, పలు మండలాల్లో రాత్రి 8%-%9 గంటల వరకూ నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. మంచిరోజు కావడం, మధ్యాహ్నం తర్వాత శుభముహూర్తం ఉండటం వలన పెద్ద సంఖ్యలో అభ్యర్థులు కార్యాలయాలకు చేరుకున్నారు. జిల్లా స్థాయిలో సమాచారం పూర్తిగా సమీకరించలేకపోవడంతో మొత్తం సంఖ్య అర్ధరాత్రి వరకూ స్పష్టంగా లభించలేదు. అయితే సర్పంచ్ పదవులకు 20 వేల కంటే ఎక్కువ, వార్డు సభ్య స్థానాలకు 50 వేలకుపైగా నామినేషన్లు చేరినట్లు తొలి అంచనాల ప్రకారం తెలుస్తోంది. డిసెంబర్ 11న జరగనున్న మొదటి దశలో 4,236 సర్పంచ్ పోస్టులు, 37,440 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఆదివారం నామినేషన్ల పరిశీలన చేపట్టడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. తిరస్కరణలకు గురైన అభ్యర్థులు సోమవారం అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 3 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. ఇక రెండో విడత నామినేషన్ల స్వీకరణ ఇవాళ (ఆదివారం) నుంచి మూడు రోజులు కొనసాగుతుంది. ఈ దశలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డు సభ్య స్థానాలకు ఎన్నికలు జరిగేలా షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించబడింది.

# జంపింగ్ పాలిటిక్స్‌తో కొంతకాలమే బాగుంటుంది

**యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్**

**యూత్ నాయకులు గ్రౌండ్‌లో పని చేస్తేనే గుర్తింపు ఉంటుందని సూచన**

**కాంగ్రెస్ పార్టీలో మంచి అవకాశాలు ఉంటాయని వ్యాఖ్య**




జంపింగ్ పాలిటిక్స్‌తో (ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి) కొంతకాలమే బాగుంటుందని, కానీ దీర్ఘకాలంలో రాజకీయాల్లో కొనసాగాలనుకుంటే అది సరైన మార్గం కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్‌లో ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న చాలామంది నేతలు గతంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లలో పనిచేసినవారేనని ఆయన గుర్తు చేశారు. ఈ సంస్థలలో పని చేస్తే కాంగ్రెస్ పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన సూచించారు. శనివారం గాంధీ భవన్ ప్రాంగణంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, యూత్ నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని, గ్రామాలలో పనిచేస్తే ప్రజల నాడి తెలుస్తుందని అన్నారు. యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన నాయకులు కార్పొరేషన్ ఛైర్మన్‌లుగా, డీసీసీ అధ్యక్షులుగా ఎదిగారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఇలాంటి అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. యూత్ కాంగ్రెస్‌కు గొప్ప భవిష్యత్తు ఉందని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ కూడా ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లను ఎంతగానో అభిమానిస్తారని ఆయన తెలిపారు. యువతకు మరింత మంచి అవకాశాలు లభించాలని ఆయన ఆకాంక్షించారు. కష్టపడి పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని, రాబోయే రోజుల్లో యువతకు ఉన్నత పదవులు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# బస్సు ప్రమాదాలపై ఎన్ హెచ్చార్సీ స్పందన.. రాష్ట్రాలకు కీలక ఆదేశాల జారీ

**నిబంధనలకు అనుగుణంగాలేని బస్సులను పక్కన పెట్టాలని ఆదేశం**

**వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో ప్రజల్లో భయాందోళనలు**

**ప్రయాణికుల ఫిర్యాదులతో స్పందించిన మానవ హక్కుల కమిషన్**



దూరప్రాంతాలకు వెళ్లే స్లీపర్ బస్సుల విషయంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్చార్సీ) రాష్ట్రాలకు కీలక సూచనలు జారీ చేసింది. వరుస బస్సు ప్రమాదాల నేపథ్యంలో ప్రయాణికుల భద్రతపై మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్న ట్రావెల్ ఏజెన్సీల పట్ల కఠినంగా వ్యవహరించాలని, రూల్స్‌కు అనుగుణంగా లేని బస్సులను పక్కన పెట్టాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఇటీవల జరిగిన కర్నూలు బస్సు ప్రమాదంతో పాటు దేశవ్యాప్తంగా పలుచోట్ల రన్నింగ్ బస్సుల్లో మంటలు ఎగిసిపడి ప్రయాణికులు చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదాల నేపథ్యంలో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పలువురు జాతీయ మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో తాజాగా మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ప్రైవేటు బస్సుల్లో భద్రతపై జాతీయ రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక సూచనలు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్లీపర్ బస్సులను పక్కన పెట్టేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు మార్గదర్శకాలు జారీ చేసింది. దూరప్రాంతాలకు వెళ్లే స్లీపర్ బస్సుల్లో సగానికి పైగా ఏసీ బస్సులే. బస్సు లోపలి భాగం ఇరుకుగా ఉండడంతో ప్రమాదం జరిగినపుడు వెంటనే బయటపడే అవకాశం తక్కువ. బస్సుల కండిషన్ పై తనిఖీల విషయంలో ట్రావెల్స్ కంపెనీలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతీ బస్సులోనూ అగ్ని ప్రమాదాలను నియంత్రించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కానీ ఇప్పుడు నడుస్తున్న బస్సుల్లో చాలావరకు ఇలాంటి వ్యవస్థ ఏదీ లేదు.

# థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలు బంద్

**నాడు జో బైడెన్ ఇచ్చిన వలస అనుమతులను రద్దు చేస్తాం**

**వలసదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు నిలిపేస్తాం**

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన**

న్యూఢిల్లీ, నవంబర్ 28: వైట్ హౌస్ సమీపంలో ఇద్దరు నేషనల్ గార్డు సిబ్బందిపై ఓ అఫ్ఘాన్ జాతీయుడు కాల్పులు జరిపిన నేపథ్యంలో అమెరికా వ్యవస్థ సంపూర్ణంగా కోలుకునేందుకు వీలుగా థర్డ్ వరల్డ్ దేశాలు (పేద దేశాలు) అన్నిటి నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. ఈ చర్య ప్రపంచ దేశాలపైన ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు ఉపాధి, విద్య కోసం, తమ దేశాలలో ఎదురవుతున్న వేధింపులను తప్పించుకునేందుకు అమెరికాకు వలసపోతున్న కోట్లాది మంది విదేశీయులపై తీవ్ర ప్రభావం చూపనున్నది. తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ ద్వారా ఈ విషయాన్ని ట్రంప్ తెలియచేస్తూ సాంకేతికంగా అమెరికా పురోభివృద్ధి చెందినప్పటికీ దాని వలస విధానం ఆ ప్రయోజనాలను, అనేక మంది జీవన పరిస్థితులను దెబ్బతీసినట్లు పేర్కొన్నారు. అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకునేందుకు మూడవ ప్రపంచ దేశాలు అన్నిటి నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తానని ఆయన ప్రకటించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో చట్టవ్యతిరేకంగా దేశంలోకి జరిగిన కోట్లాది మంది ప్రవేశాలను రద్దు చేస్తానని ఆయన తెలిపారు. అమెరికా అభివృద్ధికి పనికిరాని, తమ దేశాన్ని ప్రేమించడం చేతకాని ఎవరినైనా దేశం నుంచి పంపించివేస్తామని ఆయన హెచ్చరించారు. తమ దేశ పౌరసత్వం లేని వారికి లభిస్తున్న ప్రభుత్వ ప్రయోజనాలు, సబ్సిడీలను నిలిపివేస్తామని, దేశంలో ప్రశాంతతకు భంగం కలిగించే వలసదారులకు పౌరసత్వాన్ని కల్పించబోమని, నేరాభియోగాలు, భద్రతాపరమైన ముప్పు, పాశ్చాత్య నాగరికతకు అనుగుణంగా వ్యవహరించని విదేశీ జాతీయులను వారి దేశాలకు పంపించివేస్తామని ట్రంప్ హెచ్చరించారు. రివర్స్ మైగ్రేషన్ ఒక్కటే ఈ పరిస్థితిని చక్కదిద్దగలదని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో నివసిస్తున్న విదేశీయుల జనాభా 5.30 కోట్లు ఉందని, వీరిలో అత్యధికులు విఫల దేశాలు లేదా జైళ్లు, మానసిక చికిత్సాలయాలు, నేర గ్యాంగులు, డ్రగ్స్ ముఠాలకు చెందిన వారని మరో పోస్టులో ట్రంప్ వ్యాఖ్యానించారు. వీరు, వీరి పిల్లలు దేశభక్తులైన అమెరికన్ పౌరులు చెల్లించే పన్నులతో బతుకుతున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# ఫిరాయింపుల్లో కాంగ్రెస్-బీఆర్ఎస్ ఒకటే: కిషన్‌రెడ్డి

దళంలోకి లాగింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా అదే పద్ధతిని అనుసరిస్తోంది" అని వ్యాఖ్యానించారు. తమ పార్టీలో చేరాలనుకున్నవారిని మాత్రం రాజీనామా చేసినప్పుడే అంగీకరించామని స్పష్టం చేశారు. బిహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ 42% రిజర్వేషన్ల వాగ్దానం చేసి, అమల్లో మాత్రం బీసీలకు నష్టం జరిగేలా చర్యలు తీసుకుందని విమర్శించారు. అలాగే బీసీ జనాభాను తక్కువగా చూపి న్యాయాన్ని వక్రీకరించిన బీఆర్ఎస్ ఇప్పుడు రిజర్వేషన్లపై మాట్లాడటం మరింత ఆశ్చర్యకరమని అన్నారు. "ముస్లింలు పోటీ చేయగల కోటాలను బీసీలకు కేటాయించినట్టుగా చూపించడం వల్ల అసలు బీసీలకు లాభం చేరడం లేదు" అని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి వందే భారత్‌లో వరంగల్ చేరుకున్న కిషన్‌రెడ్డి స్టేషన్ పనులను పరిశీలించి 'చాయ్ పే చర్చ' నిర్వహించారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను సందర్శించారు. గ్రేటర్ వరంగల్‌ను విభజించటం, పారిశ్రామిక వాడలను తరలించడానికి చేస్తున్న ప్రయత్నాలు ప్రజలను నష్టపరుస్తాయన్నారు. "హిల్ట్ పి వంటి వ్యవహారాల వెనుకున్న అవినీతిని వెలుగులోకి తీసుకురావడంలో బీజేపీ పోరాటం కొనసాగుతుంది" అని తెలిపారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి, టెక్స్‌టైల్ పార్క్ పురోగతి, కాజీపేట యూనిట్ నిర్మాణం వేగవంతం అవుతున్నాయని వివరించిన ఆయన, మామునూరు విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. "టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్టులో భూమిపూజ చేయేందుకు త్వరలోనే ప్రధాని మోదీ వస్తారు" అని కిషన్‌రెడ్డి ప్రకటించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేల కోట్ల ఎంఎస్‌పీ చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఈ సీజన్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను 123కి పెంచినట్లు వెల్లడించారు.

# తెలంగాణ ఆవిర్భావ పోరాటానికి అడ్డు కాంగ్రెస్సే

రాష్ట్ర ప్రయోజనాలను రక్షించే నేత ఒక్కరైనా కనిపించడం లేదని ఆయన అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కాపాడటానికి బీఆర్ఎస్ మళ్లీ పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ వృథా చేసిందని, త్వరలో గులాబీ జెండా తిరిగి అధికారంలో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి ప్రతిష్ఠను నిలబెట్టడం తమ పార్టీ బాధ్యత అని చెప్పారు. దీక్షా దివస్ సందర్భంగా కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక దీక్షకు సంబంధించిన అరుదైన ఫొటోలను ప్రదర్శించారు. ఉద్యమం నుంచి రాష్ట్ర ఆవిర్భావం వరకు జరిగిన కీలక ఘట్టాలను ఈ ఎగ్జిబిషన్‌లో చూపించారు. అమరుల స్తూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం కేసీఆర్ ఉద్యమ చరిత్రపై తయారు చేసిన డాక్యుమెంటరీని కేటీఆర్ విడుదల చేశారు.

## భవిష్యత్ విద్యుత్ అవసరాలే కొత్త ప్రాజెక్టుల లక్ష్యం

భట్టి వెల్లడించారు. 2025-26లోనే 7,163 మెగావాట్ల లోటు ఉంటుందని, 2034-35 నాటికి ఇది 60-85 వేల మెగావాట్ల వరకు పెరిగే అవకాశముందని తెలిపారు. డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, సాగునీటి అవసరాలు పెరిగే కొద్దీ డిమాండ్ మరింత ఉద్ధృతమవుతుందని చెప్పారు. సౌర, పవన, స్టోరేజ్ రంగాల్లో గత ప్రభుత్వంలో సమగ్ర ప్రణాళికలు లేకపోవడంతో రాష్ట్రం వెనుకబడిందని విమర్శించారు. సంప్రదాయేతర విద్యుత్‌లో ఉన్న లోటు 2035 నాటికి ఐదున్నర లక్షల యూనిట్లకు చేరవచ్చని తెలిపారు. అలాగే, "థర్మల్ ఉత్పత్తిని పెంచకపోతే గ్రిడ్ స్థిరత్వం దెబ్బతింటుంది. ఒకసారి గ్రిడ్ కుప్పకూలితే రోజుకి రూ.1,500-2,000 కోట్ల నష్టం తప్పదు" అని హెచ్చరించారు. రామగుండం కొత్త యూనిట్, మక్తల్ వద్ద ప్రతిపాదిత ప్లాంట్లపై ప్రభుత్వం ఇప్పటికే ఆలోచనలు ప్రారంభించిందని భట్టి తెలిపారు. థర్మల్ యూనిట్ల కోసం గ్లోబల్ టెండర్లు పిలిచి అత్యల్ప ధరల్లోనే పనులు అప్పగిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, జెన్‌కో ఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## విద్యుత్ గణాంకాల్లో గందరగోళం

ఇదే మొదటిసారి కాదని ఎద్దేవా చేశారు. 2023లో సోలార్ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీని శ్వేతపత్రంలో 6,123 మెగావాట్లుగా చూపించారు. అయితే డిప్యూటీ సీఎం పీపీపీటీలో 2025 నాటికి అది 5,415 మెగావాట్లుగా తగ్గిపోయిందని పేర్కొన్నారు. "ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ తగ్గిపోవడం సాధ్యమేనా? గణాంకాలు రూపొందించినవారు ఒక దానితో మరొకటి సరిపోల్చి చూశారా?" అంటూ ఆయన ప్రశ్నించారు. అలాగే, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ పేజీల్లో కూడా 26,212 మెగావాట్ల ప్రస్తుత కెపాసిటీ, 2029%-%30 లక్ష్యంగా 49,104 మెగావాట్లు చూపుతున్నా, కేబినెట్ తాజా నిర్ణయాలు మాత్రం పాలసీకి విరుద్ధంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2030 నాటికి 20,000 మెగావాట్ల పునరుత్పాదక శక్తి ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, మరోవైపు 2,400 మెగావాట్ల థర్మల్ యూనిట్ల నిర్మాణాన్ని అత్యవసరంగా ప్రకటించడం సందేహాస్పదమని హరీశ్రావు వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టులపై రూ.50,000 కోట్ల వ్యయం అంచనా. ఇందులో 30-40% కమీషన్లే ఉద్దేశమా?" అని కూడా ఆరోపించారు. మక్తల్‌లో ప్రతిపాదించిన థర్మల్ యూనిట్‌పై మంత్రి శ్రీధర్‌బాబు ఒక్కోసారి ఒక్కో రకం వివరణ ఇస్తున్నారని, రామగుండం ఖర్చులపై కూడా కేబినెట్‌లో చెప్పినది - ఇప్పుడు చెబుతున్నది పరస్పర విరుద్ధమని అన్నారు. మెగావాట్‌కు రూ.14 కోట్లు ఖర్చు అవుతుందని ముందుగా చెప్పి, ఇప్పుడు "డీపీఆర్ ఇంకా కాలేదు" అని వెనక్కి తగ్గడం బాధ్యతా రాహిత్యమని విమర్శించారు. "అధికారులు ఇచ్చిన వివరాలను చదవడమే తప్ప, వాటిని పరిశీలించి ప్రజలకు సరైన సమాచారం ఇవ్వాలనే బాధ్యత మంత్రుల్లో కనిపించడం లేదు" అని అన్నారు. మహిళా సంఘాలకు 1,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు అప్పగిస్తామన్న ప్రకటనలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# అధిష్ఠానం మాటే మా నిర్ణయం

**::: సిద్ధరామయ్య-డీకే ఐక్య ప్రకటన**

**సీఎం, డిప్యూటీ సిఎం భేటీతో నాయకత్వ వివాదానికి ముగింపు సంకేతాలు**

**హైకమాండ్ నిర్ణయానికి ఇద్దరూ కట్టుబడి ఉంటామని స్పష్టీకరణ**

**వచ్చే ఎన్నికల వ్యూహంపై ప్రధాన చర్చ**

**బీజేపీ-జేడీఎస్ ఆరోపణలు రాజకీయ ప్రజ్ఞాపూర్వకమని విమర్శ**

బెంగళూరు : బెంగళూరులో నెలకొన్న రాజకీయ వేడి నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మరియు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అల్పాహార భేటీ అనంతరం ఒకే తీరు ప్రదర్శించారు. నాయకత్వ మార్పు చర్చను శాంతపరిచే ప్రయత్నంగా ఇద్దరు నేతలు కలిసి మీడియా ఎదుట నిలిచి, అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికే తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. సీఎం అధికారిక నివాసం కావేరిలో జరిగిన ఈ భేటీతో నెల రోజులుగా కొనసాగుతున్న సందిగ్ధతకు తెరపడుతుందని ఇద్దరూ సూచించారు. "మా ఇద్దరి మధ్య విభేదాలు లేవు, గతంలో కలిసి పనిచేశాం, ఇకముందూ అలాగే ముందుకు సాగుతాం," అని సిద్ధరామయ్య తెలిపారు. భవిష్యత్ ఎన్నికలపై, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, ప్రతిపక్షాలను ఎదుర్కొనే వ్యూహాలపై ముఖ్యమైన చర్చ జరిగినట్లు ఆయన వివరించారు. "అవిశ్వాస తీర్మానం గురించి కథనాలు వినిపిస్తున్నాయి. కానీ మా బలం 140. ప్రతిపక్షాలు కలిసినా సంఖ్య అంతకుమించి రాదు. అందువల్ల ఆ అంశం నిలదొక్కుకోదు," అని అన్నారు. డీకే శివకుమార్ కూడా సిఎం చేసిన ప్రతి వ్యాఖ్యకు మద్దతు ప్రకటించారు. "నాయకత్వంపై అధిష్ఠానం ఏ నిర్ణయించినా అదే అమలు. పార్టీ పెద్దలు సూచించినంతవరకు నేను వేచి ఉన్నాను. ఇంకా ఎప్పుడైనా వెళ్లమంటే వెళ్తాను," అని ఆయన స్పష్టం చేశారు. అంతేకాక, ముమ్ముందు సీఎం సిద్ధరామయ్య కూడా తన నివాసానికి భోజనానికి వస్తారని తెలిపారు. వర్గ రాజకీయాలపై వచ్చిన వ్యాఖ్యలను ఖండిస్తూ, "మా ఇద్దరి మధ్య విభేదాల్లేవు. మేం కాంగ్రెస్ వర్గం ు అంతే. క్రమశిక్షణ మా పార్టీ బలం," అని డీకే అన్నారు. హైకమాండ్ సూచనలతో జరిగిన ఈ భేటీలో గత ఒప్పందం, నాయకత్వ మార్పు సమయం, మంత్రివర్గ విస్తరణ వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో, ఢిల్లీలో కూడా కాంగ్రెస్ అగ్రనేతల సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ఖర్గే-రాహుల్ చర్చల అనంతరం, ఆదివారం సోనియా గాంధీ సమక్షంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు సూచిస్తున్నాయి.

# సంపాదకీయం

## గవర్నర్ల వ్యవస్థపై గందరగోళం..!

ప్రతి రాష్ట్రానికీ గవర్నర్‌తో కూడిన శాసన వ్యవస్థ ఉండవలెను.. అని రాజ్యాంగ అధికరణ 168 ప్రారంభమవుతుంది. ఆ శాసన వ్యవస్థలో శాసనసభ, శాసన మండలి ఉండవచ్చు... 'ప్రతి రాష్ట్రానికీ గవర్నర్‌తో కూడిన శాసన వ్యవస్థ ఉండవలెను..' అని రాజ్యాంగ అధికరణ 168 ప్రారంభమవుతుంది. ఆ శాసన వ్యవస్థలో శాసనసభ, శాసన మండలి ఉండవచ్చు లేదా ఒకే శాసనసభ ఉండవచ్చు. అసలు రాష్ట్ర శాసన వ్యవస్థలో గవర్నర్ ఉనికి అనవసరమనేది నా సునిశ్చిత అభిప్రాయం. ప్రజలు ఎన్నుకోని రాజ్యాంగ అధికారి ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కూడిన శాసనసభలో ఎందుకు భాగంగా ఉండాలి? శాసనసభ లేదా ఉభయ సభల నుద్దేశించి ప్రసంగించడం తదితర లాంఛనప్రాయమైన విధులను రాష్ట్ర శాసనవ్యవస్థలో భాగంగా కాకుండానే నిర్వహించవచ్చు. శాసన వ్యవస్థ సంబంధిత తన విధులను ఇంగ్లాండ్ రాజు ఇలానే నిర్వర్తిస్తారు కదా. శాసన వ్యవస్థలో గవర్నర్ నిర్వర్తించే నిజమైన పాత్ర బిల్లులకు అనుమతి మంజూరు చేయడమే. ఒక బిల్లు చట్టంగా రూపొందే ప్రక్రియను పూర్తి చేయడంలో గవర్నర్ ఆమోదం పొందడమనేది చాలా ముఖ్యమైన విషయం. శాసన వ్యవస్థ రాజ్యాంగ పరిమితులను అతిక్రమించకుండా ఉండేందుకు బిల్లులకు అనుమతి నివ్వడం లేదా తిరస్కరించే అధికారాలను ఒక వ్యక్తికి అప్పగించడమనేది తప్పనిసరి.
అధికరణ 216 ఇలా పేర్కొన్నది: 'శాసనసభ, శాసన మండలి ఉన్నచో ఉభయసభలచే ఆమోదింపబడిన బిల్లును గవర్నర్ సమ్మతి కొరకు పంపవలెను. గవర్నర్ సమ్మతించినచో తన సమ్మతిని, సమ్మతించక నిలుపు చేసినచో నిలుపుదలనూ, ఒకవేళ రాష్ట్రపతి సమ్మతికి నివేదించుచున్న యెడల ఆ విషయాన్ని గవర్నర్ ప్రకటించవలెను. సమ్మతిని నిలుపుచేసినచో ఆ బిల్లును శాసనసభకు పునర్విచారణ చేయమని కోరుతూ ఒక సందేశమును పంపవలెను'. ఈ అధికరణ ఇంకా ఇలా పేర్కొంది: 'గవర్నర్ సందేశానుసారం రాష్ట్ర శాసనసభ మరొకసారి చర్చను జరిపి గవర్నర్ సూచించిన మార్పులను అంగీకరిస్తే బిల్లులో వాటిని చేర్చి, గవర్నర్ సందేశాన్ని తిరస్కరించిన యెడల ఆ బిల్లును యథాతథంగా రాష్ట్ర శాసనసభ గవర్నర్‌కు తిరిగి బిల్లును పంపిన దానికి గవర్నర్ విధిగా సమ్మతిని ఇవ్వవలెను'. ఇది శాసన వ్యవస్థపై ఆరోగ్యకరమైన నియంత్రణ. అంతేగాని శాసననిర్మాణ ప్రక్రియలో ఉపద్రవాన్ని సృష్టించడానికి లైసెన్స్ ఎంతమాత్రం కాదు.

అయితే గవర్నర్లు చేస్తున్నదేమిటి? ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్లు అధికరణ 200 కింద తమకు లభించిన అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. శాసనసభ తన ఆమోదానికి పంపిన బిల్లులను తమ ఇష్టానుసారం నిలిపివేసేందుకు లైసెన్స్‌గా పరిగణిస్తున్నారు. ఈ భావనతోనే వారు పాకెట్ వీటోను ప్రయోగిస్తున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే జవాబుదారీతనం లేకుండా శాసనప్రక్రియను అడ్డుకుంటున్నారు. బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. బిల్లులను ఆమోదించడం లేదు. అలా అని తిరస్కరించడం లేదు. శాసనసభ పునఃపరిశీలనకూ పంపడం లేదు. రాష్ట్రపతి పరిశీలనకు సత్వరమే నివేదించడం లేదు. పాకెట్ వీటో అనేది ఒక నికార్సయిన దురుద్దేశం. శాసనసభ ఆమోదించిన బిల్లు రూపేణా వ్యక్తమైన ప్రజా సంకల్పాన్ని అడ్డుకోవడమే పాకెట్ వీటో లక్ష్యంగా ఉన్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే పాకెట్ వీటోకు భారత రాజ్యాంగంలో అనుమతి లేదు. ఒక బిల్లును గవర్నర్‌కు నివేదించినప్పుడు ఆయన దానిని ఆమోదించాలి లేదా తిరస్కరించాలి లేదా సాధ్యమైనంత త్వరగా శాసనసభ పునఃపరిశీలనకు పంపాలి లేదా రాష్ట్రపతి పరిశీలనకు నివేదించాలని సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. 'పాకెట్ వీటో' రాజ్యాంగ విరుద్ధమని ఆ ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ నిర్ణయాలను ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆమోదించింది. అయితే కొన్ని అంశాలపై ఈ రెండు ధర్మాసనాలూ విభేదించాయి. అయితే సామాన్య పౌరులు ఆందోళన చెందవలసినవి కావు. వాటిపై చర్చను న్యాయశాస్త్ర పండితులకు వదిలేద్దాం. శాసనసభ తనకు నివేదించిన బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్లకు నిర్దేశించిన కాలపరిమితి విషయమై సుప్రీంకోర్టు ధర్మాసనాల భిన్న దృక్కోణాలు సామాన్య పౌరులను కలవరపెడుతున్నాయి. ఇద్దరు సభ్యుల ధర్మాసనం కఠినమైన కాలపరిమితిని నిర్దేశించింది. ఆ గడువు తప్పనిసరి అని సూచించింది. విస్తృత ధర్మాసనం అందుకు అభ్యంతరం చెప్పింది. ఆ నిర్ణయాన్ని త్రోసిపుచ్చింది. 'రాజ్యాంగ అధికారులు తమ విధులను నిర్వర్తించడంలో సర్దుకుపోయే స్వభావాన్ని ప్రదర్శించాలని' సూచించింది.

**-ఎడిటర్**

## శ్రీలంకలో అత్యవసర పరిస్థితి ప్రకటించిన ప్రభుత్వం

శ్రీలంకలో మరోసారి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. గతంలో ఆర్థిక మాంద్యం కారణంగా ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే. తాజాగా దిత్వా తుఫాన్ కారణంగా అత్యవరస పరిస్థితిని అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. దిత్వా తుఫాను కారణంగా శ్రీలంక చిగురుటాకులా వణికింది. ఈ ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటి వరకు 123 మంది మరణించగా.. అనేక మంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో దేశంలో అత్యవసర పరిస్థితిని శ్రీలంక ప్రభుత్వం ప్రకటించింది. వరదల వల్ల ఏర్పడిన విధ్వంసం కారణంగా తలెత్తిన అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దేశమంతటా అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. శనివారం శ్రీలంకను దాటిన దిత్వా తుఫాను 123 మందికి పైగా ప్రాణాలను బలిగొందని, విధ్వంసం, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని ఆ దేశ అధికారులు తెలిపారు. 'దిత్వా శ్రీలంక నుండి భారత తీరం వైపు వెళ్లింది. ఈ క్రమంలో భారీ వర్షం, అధిక వేగంతో కూడిన గాలులు వీశాయి.

# పేద దేశాల పౌరులకు నో ఎంట్రీ



ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత వెనుకబడిన మూడో ప్రపంచ దేశాల పౌరులు అమెరికాలోకి అడుగుపెట్టకుండా శాశ్వతంగా నిషేధం విధిస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు... ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత వెనుకబడిన మూడో ప్రపంచ దేశాల పౌరులు అమెరికాలోకి అడుగుపెట్టకుండా శాశ్వతంగా నిషేధం విధిస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆ దేశాల పౌరులవల్లే అమెరికాలో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు జరుగుతున్నాయని ఆరోపించారు. గత అధ్యక్షుడు జో బైడెన్ నిద్ర మత్తులో ఒక్క సంతకం చేసి ఇలాంటివారిని వేలమందిని అమెరికాలోకి రానిచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారివల్ల అమెరికాలోని పశ్చిమదేశాల సంస్కృతి నాశనమవుతోందని నిందించారు. అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సమీపంలో నేషనల్ గార్డు దళ సిబ్బందిపై అఫ్గాన్ జాతీయుడు బుధవారం కాల్పులు జరిపిన నేపథ్యంలో ట్రంప్ గురువారం తన సొంత సోషల్‌మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ మేరకు ఓ పోస్టు పెట్టారు. 'సాంకేతికంగా మనం ఎంత అభివృద్ధి చెందినా.. లోపభూయిష్టమైన వలస విధానాల వల్ల వాటి ఫలితాలను అనుభవించలేకపోతున్నాం. అందువల్ల మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపేస్తాను. అమెరికాకు ఏమాత్రం ఉపయోగపడని వారిని, అమెరికాను ప్రేమించని వారిని దేశం నుంచి తరిమేస్తా' అని ప్రకటించారు. అమెరికా సమాఖ్య ప్రభుత్వం అందించే ఏ సబ్సిడీలుకానీ, ప్రయోజనాలు కానీ అమెరికా పౌరులు కానివారికి ఇకపై లభించవని ట్రంప్ ప్రకటించారు. 'అమెరికాలోని ప్రస్తుత పరిస్థితిని సరిదిద్దాలంటే తిరోగమన వలసలే మార్గం' అని స్పష్టంచేశారు. 'దొంగలు, హంతకులు, అమెరికాలో ప్రతిదాన్నీ నాశనం చేస్తున్నవారికి తప్ప మిగతా అమెరికా పౌరులందరికీ థ్యాంక్స్ గివింగ్ డే శుభాకాంక్షలు' అని ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. అమెరికాలో ప్రస్తుతం 5.3 కోట్లమంది విదేశీయులు ఉన్నారని, వారిలో చాలామంది ప్రభుత్వ సహాయం పొందుతున్నారని తెలిపారు. గ్రీన్‌కార్డుపై అమెరికాలో ఉంటూ ఏటా 30 వేల డాలర్లు సంపాదించుకుంటున్న ఒక వ్యక్తి..ఏటా 50 వేల డాలర్ల విలువైన ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నాడు అని చెప్పారు. సోమాలియా నుంచి వచ్చిన వేలమంది శరణార్థులతో అందమైన మిన్నెసోటా రాష్ట్రం నిండిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అమెరికా పార్లమెంటు సభ్యురాలు, డెమోక్రాటిక్ నాయకురాలు ఇల్హాన్ ఒమర్‌పై ట్రంప్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. సోమాలియాలో జన్మించిన ఆమె.. అమెరికాకు వలస రావటానికి సోదరుడిని వివాహం చేసుకుందని ఆరోపించారు. కాగా, ట్రంప్ ఆదేశాలతో ఇప్పటికే గ్రీన్‌కార్డు పొందినవారి దరఖాస్తులను కూడా మరోసారి లోతుగా విశ్లేషించనున్నట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో తెలిపారు. ట్రంప్ ఆదేశాల మేరకు 19 దేశాల నుంచి వలసలను నిరవధికంగా నిలిపేస్తున్నట్లు ప్రకటిస్తూ.. ఆ దేశాల జాబితాలను విడుదల చేశారు. కాగా, అఫ్గాన్ జాతీయుడు లకన్‌వాల్ కాల్పుల్లో బుధవారం తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు నేషనల్ గార్డు సభ్యుల్లో సారా (20) అనే మహిళా గార్డు మరణించినట్లు ట్రంప్ ప్రకటించారు. వెనుజువెలాలోని మాదకద్రవ్యాల ముఠాలను అంతం చేసేందుకు అతి త్వరలో ఆ దేశంలో భూమార్గంలో దాడులు నిర్వహిస్తామని ట్రంప్ ప్రకటించారు. వెనుజువెలా నుంచి సముద్రమార్గంలో అమెరికాలోకి వస్తున్న డ్రగ్స్‌ను తమ సైనిక దళాలు విజయవంతంగా అడ్డుకుంటున్నాయని ప్రశంసించారు. భూమార్గంలో కూడా ఆ దేశంలో దాడులు చేసి డ్రగ్స్ ముఠాలను అంతం చేస్తామని తెలిపారు. ట్రంప్ శారీరక, మానసిన సామర్థ్యంపై న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. 79 ఏళ్ల ట్రంప్‌నకు అధ్యక్ష విధులు నిర్వహించటం చేతకావటం లేదని, అధికారిక సమావేశాల్లో అలసటతో మాట్లాడలేకపోతున్నారని పేర్కొంది. ఈ కథనాన్ని ట్రంప్ ఖండించారు. తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. అందుకు ఇటీవల తాను వరుసగా నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ పర్యటనలే నిదర్శనమన్నారు.
అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్న అమెరికా అధికారులు.. గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులను ఇంటర్వ్యూలకు పిలిచి మరీ అరెస్టు చేస్తున్నారు. శాన్‌డియాగోలోని యూఎస్‌సీఐఎస్ ఆఫీసులో గ్రీన్‌కార్డు ఇంటర్వ్యూ కోసం వచ్చిన ఓ వ్యక్తి చేతులకు పోలీసులుబేడీలు వేసి ఈడ్చుకువెళ్తున్న వీడియో వైరల్‌గా మారింది. అమెరికా పౌరురాలైన అతడి జీవిత భాగస్వామిని కూడా అరెస్టు చేసినట్లు బాధితుడి న్యాయవాది టెస్సా కబ్రెరా మీడియాకు తెలిపారు. గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూల కోసం ఎదురుచూస్తున్నవారిని ఆఫీసుకు పిలిచి మరీ అరెస్టు చేస్తున్నారని మరో లాయర్ చెప్పారు.

## జెలెన్‌స్కీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి తొలగింపు.. కారణమిదే.?



ఉక్రెయిన్ అధ్యక్షుడి ప్రధాన కార్యనిర్వాహక అధికారి యెర్మాక్ విధుల నుంచి తొలగిపోయారు. కొన్నేళ్లుగా ఆయనతో సన్నిహిత సంబంధాలున్న జెలెన్‌స్కీకి.. రష్యాతో యుద్ధ విరమణ నేపథ్యంలో ఇలా జరగడంతో తీవ్ర తలనొప్పిగా మారినట్టైంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి ఆండ్రీ యెర్మాక్ ఉద్వాసనకు గురయ్యారు. ఆ దేశంలో చమురు రంగంలో సుమారు 10 కోట్ల డాలర్ల అవినీతి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అంతకముందు ఈ దర్యాప్తులో భాగంగా.. యెర్మాక్ నివాసం, కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. 54 ఏళ్ల యెర్మాక్.. జెలెన్‌స్కీకి ముఖ్య అనుచరుడు. ఒకప్పుడు టీవీ హాస్యనటుడిగా పేరున్న జెలెన్‌స్కీకి.. మాజీ నిర్మాత, కాపీరైట్ న్యాయవాది అయిన యెర్మాక్‌తో సుమారు 15 ఏళ్ల నుంచి సన్నిహిత సంబంధాలున్నట్టు తెలుస్తోంది. 2019లో వీరివురూ ఆ దేశ రాజకీయాల్లో ప్రవేశించి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఉక్రెయిన్ దేశాధ్యక్షుడైన తర్వాత జెలెన్‌స్కీతో యెర్మాక్ సంబంధం మరింత బలపడింది. ఆ దేశ ప్రధాని సహా ఇతర మంత్రులను నియమించడంలోనూ ఆయన కీలకంగా వ్యవహరించినట్టు సమాచారం. ఇలా యెర్మాక్.. ఆ దేశంలో రెండో ప్రభావ వంతమైన వ్యక్తిగానే కాకుండా.. ఒకానొక సందర్భంలో వైస్ ప్రెసిడెంట్ అని కూడా పలువురి నుంచి కితాబందుకు న్నారు. రష్యాతో యుద్ధం నేపథ్యంలో.. అమెరికాతో సంబంధాలను మెరుగుపరిచేందుకు జరిగే చర్చల్లో ఉక్రెయిన్ తరఫున కీలకపాత్ర పోషించారాయన. ప్రస్తుతం.. రష్యాతో యుద్ధాన్ని విరమించుకోవాలని అమెరికా నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్న సందర్భంలో.. యెర్మాక్ ఇలా ఉద్వాసనకు గురికావడం జెలెన్‌స్కీకి తీవ్ర తలనొప్పిగా మారినట్టైంది. ఐరోపా సమాఖ్య (ఈయూ)లో చేరాలనుకుంటున్న జెలెన్‌స్కీకి.. తొలుత అవినీతిని నిర్మూలించాలనే నిబంధన విధిస్తోంది ఈయూ. దీంతో జెలెన్ స్కీతో సంబంధమున్న యెర్మాక్‌పై వేటు పడింది. ఈ చమురు కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే ఆ దేశంలో ఇద్దరు మంత్రులు రాజీనామా చేశారు. యెర్మాక్ ఇద్దరు అసిస్టెంట్లలో ఒకరు గతేడాది రాజీనామా చేయగా, మరొకరు ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్నారు. ఈ ముగ్గురిపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. ఈ తరుణంలో యెర్మాక్‌ను తొలగించాలని ప్రతిపక్షాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి కారణంగా ఆయన రాజీనామా చేశారు. జెలెన్‌స్కీ దీనిని ఆమోదించడంతో.. ఆయన విధుల నుంచి తొలగిపోయారు.




శ్రీలంకను భారీ వర్షాలు, వరదలు ఊపిరిసలపనివ్వడంలేదు. జనజీవనం పూర్తిగా స్థంభించిపోయింది. పాఠశాలలు, కార్యాలయాలు మూసివేశారు. వరుస ప్రమాద హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ఇప్పటి వరకూ 56 మంది ప్రాణాలు కోల్పోయారు. ద్వీపకల్ప దేశం శ్రీలంకను భారీ వరదలు ముంచెత్తుతున్నాయి. దేశంలో కుండపోత వర్షాలు, వరదల కారణంగా ఇప్పటి వరకూ 56 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మూసివేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు నిన్న (గురువారం) తీవ్రరూపం దాల్చాయి. ఇప్పటివరకు 600కి పైగా ఇళ్లు దెబ్బతిన్నాయి. 21 మంది జాడ తెలియడంలేదు. బదుల్లా, నువర ఎలియా ప్రాంతాల్లో 25 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాంతాలు కొలంబో నుంచి 300 కి.మీ. దూరంలో టీ గార్డెన్‌లకు ప్రసిద్ధి చెందిన పర్వతాల్లో ఉన్నాయి.

తూర్పు అంపరా పట్టణంలో వరదలతో కారు కొట్టుకుపోవడంతో మరో ముగ్గురు మరణించారు. మొత్తం 14 మంది గాయపడ్డారు. నదులు, కాలువలు నిండిపోవడంతో రోడ్లు, రైలు ట్రాక్‌ల పైకి మట్టి, చెట్టు పేరుకుపోయాయి. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటోంది. ప్యాసింజర్ రైళ్లను పూర్తిగా ఆపే శారు. పలు రోడ్లు మూసివేశారు. రక్షణ బలగాలు సహా యక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఎయిర్‌ఫోర్స్ హెలికా ప్టర్‌లు ఇళ్ల పైకప్పులపై చిక్కుకున్న ముగ్గురిని రక్షించాయి. నేవీ, పోలీసులు బోట్లతో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షిస్తున్నారు. ఈ విపత్తు శ్రీలంక ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో, వరుస ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తున్నారు. భారీ వర్షాలు, వరదలు శ్రీలంక ప్రజల జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

## పాకిస్తాన్‌లో హిట్లర్ తరహా దమనకాండ : ఇమ్రాన్ ఖాన్ సోదరి తీవ్ర ఆరోపణలు



పాకిస్తాన్లోని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం మీద ఇమ్రాన్ ఖాన్ సోదరి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్లో జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనలపై అంతర్జాతీయ సమాజం దృష్టి పెట్టాలని ఆమె కోరారు. పాకిస్తాన్‌లో ఈ దుస్థితి ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమని, ప్రజల ఆగ్రహం ఎప్పుడైనా.. పాకిస్తాన్ దేశ చరిత్రలో అత్యంత చీకటి కాలాన్ని ఇప్పుడు ఎదుర్కొంటోందని పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) చైర్మన్ ఇమ్రాన్ ఖాన్ సోదరి నూరీన్ నియాజీ తీవ్ర విమర్శలు చేశారు. పాకిస్తాన్లో ప్రస్తుతం 'హిట్లర్ యుగం'నాటి దమనకాండ జరుగుతోందని ఆమె చెప్పారు. దేశంలో పౌరులు.. కిడ్నాప్‌లు, హత్యలు, జైలు శిక్షలు అనే అన్యాయాలకు గురవుతున్నారని, ఇది ఒక దుర్మార్గపు పాలన అని ఆమె అన్నారు. తాను పెషావర్‌లో కలిసిన ఒక యువకుడి ఉదంతం గురించి నూరీన్ వివరించారు. 'గతేడాది నవంబర్ 26న తలపై కాల్చడం వల్ల అతను పక్షవాతం బారిన పడ్డాడు. అతని శరీరం పూర్తిగా దెబ్బతింది. ఇలాంటి కేసులు దేశంలో లెక్కలేనన్ని ఉన్నాయి' అని ఆమె చెప్పారు. 'మేము చరిత్రలో హిట్లర్ యుగం గురించి చదివేవాళ్లం, కానీ ఇప్పుడు మేము దాన్ని అనుభవిస్తున్నాం. ప్రజలను చిత్రవధ చేసి బలవంతం చేస్తున్నారు.' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పంజాబ్ పోలీసులు.. పిల్లలు, వృద్ధులు, ఆడవాళ్లు ఇలా.. ఎవరైనా కొట్టడానికి ఆమోదం తెచ్చుకున్నారని, దీనిని ఎవరూ ప్రశ్నించరని నూరీన్ విమర్శించారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం చరిత్రలో అత్యంత అప్రజాదరణకు గురైన ప్రభుత్వమని ఆమె అన్నారు. పాకిస్తాన్ సైన్యాధినేత జనరల్ ఆసిమ్ మునీర్‌ను 'డిక్టేటర్'గా ఆమె చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోయినా అక్రమార్గంలో అధికారంలోకి వచ్చిందని, విదేశీ శక్తుల మద్దతుతోనే కొనసాగుతోందని ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# డిసెంబర్ 1న ముదిరాజ్ మహాసభ నిరసన వాయిదా

-పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా
-నిర్ణయాన్ని ప్రకటించిన కాసాని వీరేష్ ముదిరాజ్
-మండలాల వారిగా అమరుడు పోలీస్ కిష్టయ్య
-వర్ధంతి సభలు నిర్వహించాలని పిలుపు..



**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
డిసెంబర్ 1న బీసీ"ఏ" సాధన కోసం ఇచ్చిన పిలుపును నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేశామని అఖిల భారత కోలీ సమాజ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం హైదరాబాదులోని ఓ ప్రయివేట్ హోటల్లో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఈ వాయిదా విషయాన్ని ప్రకటించారు...పంచాయితీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావించడం ...ఎన్నికల కమిషన్ ఎన్నికల తేదీని ఖరారు చేయడంతో ...రాష్ట్రంలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి... నిరసన కార్యక్రమాలకు అడ్డంకులు కూడా తలెత్తాయి ..అందుచేత డిసెంబర్ 1న ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు హైవే దిగ్బంధం నిరసన కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు వీరేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ ...నేను ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ సోదరులు కార్యక్రమం నిర్వహి ంచడానికి సన్నద్ధమయ్యారని... అయినప్పటికీ మనలోని మన సోదరులు, బంధుమిత్రులు, ముదిరాజ్ నాయకులు ఎంతోమంది ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని సంకల్పించారు. వారి విజయం మనందరి బాధ్యత మన సంఘటిత మద్దతు వారికి అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో, వారి అభ్యర్థన, సూచన మేరకు డిసెంబర్ 1న జరగాల్సిన హైవే దిగ్బంధం మరియు ఇతర నిరసన కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి పూర్తయిన వెంటనే సమావేశం నిర్వహించి, భవిష్యత్తులో మనం చేపట్టబోయే కార్యక్రమాల తేదీలను, తీరుతెన్నులను, మన పోరాటం తదుపరి దశ..ఇవన్నీ సమష్టిగా చర్చించి నిర్ణయించుకుందామని పేర్కొన్నారు..

# పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల బస్ డిపో ఉద్యోగి, సిఎచ్ గురునాథ్ రెడ్డి (డి.ఐ) పదవి విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శనివారం వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నకుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి శాలువాతో సత్కరించి వారికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి విరమణ సహజమని గురునాథ్ రెడ్డి చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవ రెడ్డి తోటి ఉద్యోగస్తులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పదవి విరమణ వయసుకు మాత్రమే... ప్రజాసేవకు కాదు

-బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
పదవి విరమణ అనేది వయసుకు మాత్రమేనని ప్రజాసేవకు కాదని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్ స్వాగత్ గ్రాండ్ హోటల్ నందు నిర్వహించిన కుత్బుల్లాపూర్ సర్కిల్ టాక్స్ ఇన్స్పెక్టర్ మెండు శ్రీనివాస్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మెండు శ్రీనివాస్ రెడ్డి - విజయలక్ష్మి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలం దాదాపు 40 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో వారి సేవలను అందించి ట్యాక్స్ ఇన్స్పెక్టర్ గా పదవీ విరమణ పొందిన శ్రీనివాస్ రెడ్డికి వయసురీత్యా మాత్రమే పదవీ విరమణ అని, ప్రజా సేవకు పదవి విరమణ ఉండదని అన్నారు. శ్రీనివాస్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ - గాజుల రామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డి, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దీక్ష దివాస్ కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లిన ప్రజలు

-డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో ర్యాలీ



**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సూరారం డివిజన్ పరిధిలోని సబ్ స్టేషన్ దగ్గర నుండి దీక్షా దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం సూరారం డివిజన్ నుండి డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు, భారీ ఎత్తున ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కెసిఆర్ అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కాలనీ ప్రెసిడెంట్లు పలు సీనియర్ నాయకులు టిఆర్ఎస్ అభిమానులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలకు వినియోగించాలి

-ఆకుల సతీష్, ఆంజనేయులు





**దుండిగల్ , ప్రజాజ్వాల:**
దుండిగల్ మండలం మల్లంపేట గ్రామం సర్వేనెంబర్ 258(4.5ఎకరాలు)55(1ఎకరాలు) ప్రభుత్వ భూమిని చిన్నచిన్న ఆక్రమణలు తొలగించి, ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల లేక రైతు బజార్ బస్సు డిపో కోసం స్వాధీనం చేసుకొని వినియోగించాలని శనివారం దుండిగల్ ఎమ్మార్వోకు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ఆంజనేయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ ఆంజనేయులు మాట్లాడుతూ.. మల్లంపేట గ్రామం, సర్వే నెంబర్ 258 నందు4.25 ఎకరాల ప్రభుత్వ భూమి కలదు. ప్రభుత్వ భూమి నందు నాలుగు ప్రాంతాల్లో జరిగినాయి. ప్రభుత్వ భూమి నందు గతంలో రైతు బజార్ కోసం పనులు కూడా చేయడం జరిగింది. ఈ ప్రభుత్వ భూమి నందు దాదాపు ఎకరం వరకు ఆక్రమణ అక్రమ నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు ఆనుకొని ఉన్న 4.25 ఎకరాల (100 కోట్ల విలువైన) ప్రభుత్వ స్థలం 90% ఖాళీగా ఎలాంటి ఫెన్సింగ్ లేకపోవడం వల్ల రోజు ఆక్రమణకు గురవుతుంది. కావున ఇట్టి విలువైన ప్రభుత్వ స్థలం మల్లంపేట ప్రభుత్వ పాఠశాల ప్రతి వర్షాకాలంలో వర్షపు నీటి వల్ల మునిగిపోతుంది. కావున ప్రభుత్వ పాఠశాలకి గతంలో రైతు బజార్ కోసం కేటాయించిన విధంగా దీనిని కేటాయించడమే కాకుండా ఫెన్సింగ్ వేసి రక్షించాలని ,అంతేకాకుండా ఈ ప్రభుత్వ స్థలాన్ని ఆనుకొని షెడ్డు నిర్మించి వ్యాపారం చేస్తున్న వాటిని కూల్చివేయాలని, అంతేకాకుండా ఇటీవల వెంచర్ వారు ఫెన్సింగ్ వేసిన దాంట్లో కూడా కొద్ది స్థలము వస్తుంది. కావున తక్షణమే సర్వే చేసి ప్రభుత్వ భూమిని గుర్తించి ఆక్రమణలను తొలగించడమే కాకుండా ప్రభుత్వ భూమిని పాఠశాల/రైతు బజార్ కోసం కేటాయించడం ద్వారా ఆక్రమణలకు గురి కాకుండా రక్షించడమే కాకుండా, ప్రజా అవసరాలకు వినియోగించిన లక్ష్యం నెరవేరుతుంది అని తెలిపారు. సర్వే నెంబర్ 55 ప్రభుత్వ స్థలం సర్వే చేసి గుర్తించి, ఆలయం నందు బస్సు పార్కింగ్ కి సరిపోవడం లేదు కాబట్టి మల్లంపేటకు వచ్చే బస్సుల పార్కింగ్ కోసం బస్ స్టాప్ కోసం కేటాయించాలని మనవి చేస్తున్నాను అని తెలిపారు. అంతేకాకుండా సర్వే నెంబర్ 55 ప్రభుత్వ భూమి పక్కనే రెండు వెంచర్లల్లో కొద్దిగా కలిసి ఉన్నది కాబట్టి సర్వే చేసి దాన్ని కూడా పరిరక్షించాలని ఇదే సర్వే నెంబర్లు షాపులను తొలగించి ఈ భూములను ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరడం జరిగింది అని తెలిపారు తక్షణమే స్పందించిన ఎమ్మార్వో తప్పకుండా ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ,ప్రజా అవసరాలకి ఉపయోగపడే విధంగా రక్షించడమే కాకుండా వినియోగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అరుణ్ రావు, పండు, హరిదాస్, బాలరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




# జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో కార్మెల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ

-విజేతలను అభినందించిన అదనపు కలెక్టర్ పింకుష్ గోయల్



**జనగామ జిల్లా, ప్రజాజ్వాల:**
పాలకుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు జనగామ లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ లో ప్రథమ, ద్వితీయ స్థానాలను గెలుచుకోవడం అభినందనీయమని అదనపు కలెక్టర్ పింకుష్ గోయల్ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఈ పోటీలలో పాల్గొన్న కీర్తి 8వ తరగతి, వి హర్షిత 8వ తరగతి, ప్రథమ బహుమతి సాధించగా, కే శరణ్య 9వ తరగతి ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అదనపు కలెక్టర్ పింకుష్ గోయల్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ ఎలిజిబెత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి టీచర్ వంశీ, రజిత , హరి, భవాని టీచర్ పాల్గొన్నారు.

# గీతాంజలి హైస్కూల్‌లో ప్రపంచ మానవ హక్కుల పక్షోత్సవాలు

-రాజ్యాంగ ప్రవేశిక, సమాచార హక్కు, జాతీయ న్యాయ సేవధికార చట్టం పై అవగాహన




**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
ప్రపంచ మానవ హక్కుల సమితి బ్లూ క్రీసెంట్ సొసైటీ హక్కుల పక్షోత్సవాల్లలో నాలుగవ రోజు సూరారం డివిజన్, రాజీవ్ గాంధీ నగర్ లోని గీతాంజలి హై స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగ ప్రవేశిక సమాచార హక్కు చట్టం, జాతీయ న్యాయ సేవాధికార చట్టం పై ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే అవగాహన కల్పించారు. మహిళలకు, పేదలకు, బాలలకు, కార్మికులకు ఉచిత న్యాయ సహాయం న్యాయ సేవధికార సంస్థలు అందిస్తాయి అన్నారు. ఉచిత న్యాయ సహాయం కొరకు 15100 కు సంప్రదించవచ్చు అని అన్నారు. అలాగే నైటింగేల్ అంధుల సాంస్కృతిక సంస్థ , సూరారం కాలనీ వారికి విద్యార్థులు యాజమాన్యం వారు పదిహేను వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వ్యవస్థాపకులు తూటే విజయ్ కుమార్, పాఠశాల కరెస్పాండంట్ మహిపాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సరిహద్దుల్లో కట్టుదిట్టమైన చెక్‌పోస్ట్

స్థానిక ఎన్నికల దృష్ట్యా పోలీసుల ప్రత్యేక చర్యలు



**రాయికోడ్, ప్రజాజ్వాల:**
గ్రామపంచాయతి ఎన్నికలు సమీపిస్తుండటంతో సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేసేందుకు తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో కట్టుదిట్టమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని గణేష్‌పూర్ వద్ద జహీరాబాద్ బీదర్ రోడ్డు పై హద్నూర్ పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా హద్నూర్ ఎస్ఐ సుజిత్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మద్యం, డబ్బు, ఇతర వస్తువుల అక్రమ వస్తువుల రవాణాను నిరోధించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రూ.50 వేలకుపైగా నగదును సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తే సీజ్ చేస్తామని, అత్యవసర అవసరాల కోసం తీసుకెళ్తున్నవారు అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే ఎవరికైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు. కర్ణాటక సరిహద్దు ఆనుకుని ఉండటంతో ఈ ప్రాంతంలో అక్రమ రవాణా అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందుకే చెక్‌పోస్టును మరింత బలపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్‌పూర్, హుస్సెల్లి గ్రామాల పంచాయతి కార్యదర్శులు చంద్రశేఖర్, గాలయ్య స్వామి, పోలీసులు పాల్గొన్నారు..

# గోపాలగిరిలో బీజేపీ-బీఆర్ఎస్‌కు భారీ దెబ్బ

-తొర్రురు మండలంలో బలంగా కాంగ్రెస్ పక్షం
-టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝూన్సిరెడ్డి సమక్షంలో చేరికల పర్వం



**తొర్రూరు, ప్రజాజ్వాల:**
తొర్రురు మండలం గోపాలగిరి గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మారపు యాకయ్య, బీజేపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మరపు వెంకన్న, మాజీ వార్డు సభ్యులు ధర్మరపు మహేష్, ధర్మరపు నరేష్, షేక్ యాకుబ్ పాషా, మహిళా నాయకులు ధర్మరపు విజయ, అనూషలు ఆ పార్టీలకు రాజీనామా చేసి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝూన్సి రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఈ సందర్భంగా చేరికలు చేసిన వారు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝూన్సి రాజేందర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు చూసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు..

# దేవరుప్పుల మండలంలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్

**-లక్ష్మణ్ తండా బీఆర్ఎస్ నాయకులు 15 మంది రాజీనామా**

**- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక**

**జనగామ జిల్లా, ప్రజాజ్వాల:**

స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాలకుర్తి మండల కేంద్రంలో దేవరుప్పుల మండలం లక్ష్మణ్ తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు 15 మంది తమ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.. పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా చేరిన నేతలకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రజల అభివృద్ధి, సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత తమను ఆకట్టుకుందని, అందుకే ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్టుగా తెలిపారు.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పార్టీ శ్రేణులు, కొత్తగా చేరిన నాయకులు చురుకుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ప్రజలకు చేరువగా సేవలందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భాజపాలో చేరిన మాజీ సర్పంచ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు





**పాలకుర్తి, ప్రజాజ్వాల:**

కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఈరవెన్ను గ్రామ మాజీ సర్పంచ్ ముస్కు నిర్మల- చంద్రబాబు తోపాటు శతాపురం దుబ్బ తండాకు చెందిన గుగులోతు రవీందర్ మరి కొంతమంది కాంగ్రెస్ నాయకులు ,భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మారం రవికుమార్ ,జిల్లా నాయకులు దొంగరి మహేందర్ ల ఆధ్వర్యంలో జిల్లా పార్టీ అధ్యక్షులు చౌడ రమేష్ , రాష్ట్ర పార్టీ నాయకులు దశమంత్ రెడ్డి కేవీఎల్ న్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షులు చౌడ రమేష్ మాట్లాడుతూ.. మరికొన్ని గ్రామాల నుండి కూడా పార్టీలో చేరడానికి నాయకుల సిద్ధంగా ఉన్నారని వారిని ఆహ్వానించి పార్టీని బలోపేతం చేసే దిశగా పనిచేయాలని,భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజల ఆర్థిక అభివృద్ధి తో పాటు, దేశ అభివృద్ధికి పాటుపడుతుందని, ఈ విషయం గ్రహించి ప్రజలు భారతీయ జనతా పార్టీ నాయకులను ప్రజాప్రతినిధులు చేయడానికి సిద్ధంగా ఉన్నారని ప్రతి గ్రామంలో వార్డు సభ్యులతో పాటు సర్పంచ్ లుగా పోటీ చేసి గెలుపొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజు, కాసోజు సమ్మయ్య చారి, తాజా మాజీ ఎంపీటీసీ కొడిశాల యాదగిరి, మాజీ ఎంపీటీసీ అనుముల ఎల్లయ్య, సుధాకర్, ఉప్పలయ్య, పోషయ్య , తదితరులు పాల్గొన్నారు

# ఎలాంటి రాత పరీక్ష లేకుండానే ఇండియన్ ఆర్మీలో ఉద్యోగాలు.. పదో తరగతి అర్హత

**హైదరాబాద్ – ప్రజాజ్వాల ప్రతినిధి**




క్రీడా కోటాలో డైరెక్ట్ ఎంట్రీ కింద హవిల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఇండియన్ ఆర్మీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఖాళీల వివరాలు ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే ఆ వివరాలు తెలియజేస్తూ కమిషన్ ప్రకటన వెలువరించనుంది.. ఇండియన్ ఆర్మీ నిరుద్యోగ యువతకు మరో గుడ్‌న్యూస్ చెప్పింది. క్రీడా కోటాలో డైరెక్ట్ ఎంట్రీ కింద హవిల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఖాళీల వివరాలు ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే ఆ వివరాలు తెలియజేస్తూ కమిషన్ ప్రకటన వెలువరించనుంది. 2023 అక్టోబర్ 1 నుంచి, ఆ తరువాత అంతర్జాతీయ, జూనియర్ లేదా సీనియర్ కేటగిరీలో జాతీయ ఛాంపియన్‌షిప్, ఖేలో ఇండియా గేమ్స్, యూత్ గేమ్స్, ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులు దరఖాస్తు చేస్తుకోవచ్చు. నియామక ట్రయల్స్ కోసం అర్హత కలిగిన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు భారత సైన్యం ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలు ఈ కింద చెక్ చేసుకోవచ్చు.. స్పోర్ట్స్ కోటాలో హవల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టులకు భర్తీ చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు నోటిఫికేషన్‌లో సూచించిన విధంగా నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, కబడ్డీ తదితర క్రీడల్లో అంతర్జాతీయ లేద జూనియర్ లేదా సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ లేద ఖేలో ఇండియా గేమ్స్ లేదా యూత్ గేమ్స్‌లో పాల్గొని ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి 17వ సంవత్సరాల నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. అంటు మార్చి 31, 2001 నుంచి ఏప్రిల్ 1, 2008 ఏళ్ల మధ్య జన్మించి ఉండాలి. ఈ అర్హతలు ఉన్న వారు ఎవరైనా డిసెంబర్ 15, 2025వ తేదీలోగా ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి రాత పరీక్ష లేకుండానే స్పోర్ట్స్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. నింపిన దరఖాస్తులను ఈ కింది అడ్రస్‌కు ఫోన్ ద్వారా పంపించవల్సి ఉంటుంది.



# ఏపీపై ఉరుముతున్న తుఫాన్.. బాబోయ్.! ఈ జిల్లాలకు భారీ రెయిన్ అలెర్ట్

**హైదరాబాద్ – ప్రజాజ్వాల ప్రతినిధి**

బంగాళాఖాతంలో ఏర్పడ్డ దిత్వా తుఫాన్.. తమిళనాడు వైపు కదులుతోంది. తమిళనాడులో తీర ప్రాంత జిల్లాలకు సమాంతరంగా కదలుతోందీ తుఫాన్.. పుదుచ్చేరి, చెన్నైపై తీవ్ర ప్రభావం ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే చెన్నై, పుదుచ్చేరిలో బీచ్‌లు మూసివేశారు. ఆ వివరాలు ఇలా.. బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వ తుఫాను.. భారత్ వైపు వేగంగా కదులుతోంది. గడచిన 6 గంటల్లో 5 కిలోమీటర్ల వేగంతో తుఫాను గమనం సాగుతోంది. కారైకల్ కు తూర్పున 80 కి.మీ., వేదరన్నియం కు తూర్పున 100 కి.మీ., చెన్నైకు 250, పుదుచ్చేరికి 160 కిలోమీటర్ల దూరంలో తుఫాను కేంద్రీకృతమై ఉంది. ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ తుఫాను.. మరికొద్ది గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరికి మరింత సమీపానికి చేరుకోనుంది. తీరానికి సమాంతరంగా ప్రయాణిస్తోంది. కృష్ణపట్నం పోర్టుకు మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మిగిలిన అన్ని పోర్టుల్లో రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అటు తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు ఏపీకి భారీ వర్షాలు పడతాయంది వాతావరణ శాఖ. ఇప్పటికే దక్షిణ కోస్తా, రాయలసీమలో చాలా చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేయగా.. ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్.. గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఇక సోమవారం ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్.. ఈస్ట్ గోదావరి, కోనసీమ, వెస్ట్ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణ, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తాయని.. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు అధికారులు. అటు తెలంగాణ విషయానికొస్తే.. దిత్వా తుఫాన్ ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ ఆదివారం నైరుతి బంగాళాఖాతంలో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల సమీపంలోకి చేరుకుంది. దీని ప్రభావంతో తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది వాతావరణ శాఖ. అలాగే రాష్ట్రంలోని భద్రాచలంలో అత్యధికంగా 17 డిగ్రీలు.. ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో 10 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది.

# ఘనంగా మిండు శ్రీనివాస్ రెడ్డి పదవి విరమణ ఆత్మీయ సమ్మేళనం



**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**

కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల స్వాగత్ గ్రాండ్ హోటల్ లో సీనియర్ అసిస్టెంట్ (టాక్స్ ఇన్స్పెక్టర్) మిండు శ్రీనివాస్ రెడ్డి పదవి విరమణ ఆత్మీయ సమ్మేళన సమావేశమునకు విచ్చేసిన మేడ్చల్ మల్కాజ్గిరి డి.సి.సి ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్ని రోజులు గవర్నమెంట్ ఎంప్లాయ్ సర్వీస్ లో ఉండి రిటర్మెంట్ అవుతున్న శ్రీనివాస్ రెడ్డి దంపతులకు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు కలిగి ఇక ముందు జీవితం సుఖ జీవనంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నరసింహులు, గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ హరిబాబు, జి బాలప్ప బి సత్యనారాయణ, జి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇరవెన్ను సిపిఎం సర్పంచ్ అభ్యర్థిగా తాటికాయల జానీ



**పాలకుర్తి, ప్రజాజ్వాల:**

మండలంలోని ఇరవెన్ను గ్రామంలో శనివారం సిపిఎం పార్టీ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొంతం సాయిలు అధ్యక్షతన సిపిఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక ఎన్నికలపై సమీక్షిస్తూ మాట్లాడారు. సమావేశంలో సిపిఎం ఇరవెన్ను గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తాటికాయల జానీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇరవెన్ను గ్రామములో మొట్టమొదటిసారిగా సిపిఎం పార్టీ అభ్యర్థిని సర్పంచ్ గా పోటీకి సిద్ధమవుతున్నందున పార్టీ కార్యకర్తలు అందరూ ఐక్యతతో కృషిచేసి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ గ్రామ కార్యదర్శి ఎదునూరి మదార్ ,మాసంపల్లి నాగయ్య, పార్టీ సభ్యులు మహమ్మద్ అఖిల్ పాష ,తాటికాయల అనిల్, దేవా, కొంతం మహేందర్ తదితరులు పాల్గొన్నారు

# ఆటగదరా శివ.. కూతురు అన్నప్రాశన రోజే.. తండ్రిని వెంటాడిన మృత్యువు..

**హైదరాబాద్ – ప్రజాజ్వాల ప్రతినిధి**

తాము అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమార్తెకు ఆరోజు అన్నప్రాశన..ఈ వేడకు ఏపీలోని ద్వారకాతిరుమలలో ఘనంగా నిర్వహించారు తెలంగాణకు చెందిన ఓ కానిస్టేబుల్. ఈ వేడుకతలో ఫ్యామిలీ అంతా హ్యాపీగా ఉన్నారు.. కానీ ఇంతలోనే పెను విషాదం ముంచుకొచ్చింది.. సాయంత్రం బయటకెళ్లిన చిన్నారి తండ్రి తిరిగి ఇంటికి రాలేదు. గుండెపోటుతో మృతి చెందాడు. కుమార్తె అన్నప్రాశన రోజునే తండ్రి గుండెపోటుతో మృతి చెందిన ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో వెలుగు చూసింది. కూతురు అన్నప్రాశాన చేశామన్న ఆనందంలోంచి బయటకు రాకముందే ఆ కుటుంబాన్ని విషాదం ముంచెత్తింది. సాయంత్రి బయటకెళ్లి వాస్తానని చెప్పిన చిన్నారి తండ్రి గుండె పోటుతో మరణించడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కంతనపల్లి గ్రామానికి చెందిన పల్లబోయిన హన్మంతరావు అనే వ్యక్తికి విజయ అనే యువతితో కొన్నాళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు కుమార్తె కూడా ఉంది. హన్మంతరావు సత్తుపల్లి మండలం గంగారం పోలీస్ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో అతను కుటుంబంతో కలిసి సత్తుపల్లిలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్నాడు. అయితే ఈ దంపతులు తమ కుమార్తెకు శుక్రవార ఏపీలోని ద్వారకాతిరుమలలో అన్నప్రాశన వేడుకను కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక తర్వాత ఫ్యామిలీ మొత్తం ఎంతో సంతోషంగా ఇంటికి చేరకున్నారు. అయితే ఇంటికొచ్చాక హన్మంతరావు.. ఏదో పనిమీద ఇంటి నుంచి బయటకెళ్లాడు. ఈ క్రమంలోనే అతను అకస్మాత్తుగా రోడ్డుపై కుప్పకూలాడు.. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ హన్మంతరావును పరీక్షించిన వైద్యులు అప్పటికే అతని మరణించినట్టు నిర్ధారించారు. ఈ విషయం విన్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇక ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం.. కాలి బూడిదైన 32 షాపులు.. భారీగా ఆస్తి నష్టం

**హైదరాబాద్ – ప్రజాజ్వాల ప్రతినిధి**

కొండగట్టులో ఓ షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు సమీపంలోని షాపులకు వ్యాపించడంతో భారీగా ఆస్తి నష్టం జరిగింది. ఏకంగా 22 షాపులు ఈ అగ్నిప్రమాదం వల్ల దగ్ధమయ్యాయి. శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటి వల్ల భారీగా ఆర్థిక, ప్రాణ నష్టం జరుగుతోంది. శనివారం కొండగట్టులో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి 11 గంటల సమయంలో పట్టణంలోని ఓ బొమ్మల దుకాణంలో మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్క షాపులకు కూడా వ్యాపించడంతో మొత్తం 32 షాపులు పూర్తిగా దగ్ధమై భారీ ఎత్తున మంటలు, పొగలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయభ్రాంతులై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కానీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పట్టణంలోని కొండగట్టు స్టేజీ వద్ద ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా..

హనుమాన్ విగ్రహం నుంచి కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి వరకు ఉన్న మొత్తం 32 బొమ్మల షాపులు దగ్ధమయ్యాయి. దీంతో షాపుల్లోని సామాగ్రి మొత్తం కాలి బూడిదవ్వడంతో భారీగా ఆస్తి నష్టం చేకూరింది. ఒక్కో షాపులో రూ.8 నుంచి రూ.10 లక్షల విలువైన సామాగ్రి దగ్ధమైనట్లు అధికారులు అంచనా వేశారు. దీంతో ఈ అగ్నిప్రమాదంతో రూ.కోటి వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఫైర్ సిబ్బంది 12 గంటలకు చేరుకోగా.. అప్పటికే దుకాణాలు అన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. భారీగా ఆస్తి నష్టం జరగడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపడుతున్నారు.

# కోహ్లీ కోసం డ్రైవర్‌గా మారిన ధోనీ..ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ

ఎంఎస్ ధోనీ , విరాట్ కోహ్లిని విడివిడిగా చూస్తేనే ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీగా ఫీలవుతారు. అదే ఈ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో ఉంటే.. అది కూడా పక్కపక్కన, ఒకే కారులో కూర్చుంటే. అంతేకాదు ధోనీ డ్రైవ్ చేస్తుంటే కోహ్లి పక్క సీటులోనే ఉంటే ఇక మామూలుగా ఉండదుగా. సరిగ్గా అలాంటిదే జరిగింది. మహేంద్ర సింగ్ ధోనీ తన కారు డ్రైవ్ చేస్తూ, పక్క సీటులో కోహ్లి ప్రయాణించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎలాంటి హంగామా లేకుండా, ధోని డ్రైవింగ్ సీట్‌లో, కోహ్లీ పక్కన కూర్చుని ప్రయాణించడం..పాత జ్ఞాపకాలను, వారిద్దరి మధ్య అనుబంధాన్ని గుర్తు చేస్తోంది. సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ ఓడిన భారత జట్టు, నవంబర్ 30 నుంచి మూడు మ్యాచుల వన్డే సిరీస్ ఆడనుంది. మొదటి వన్డే రాంఛీలో జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే భారత ప్లేయర్లు, రాంచీకి చేరుకున్నారు. చాలా రోజుల తర్వాత రాంఛీలో మ్యాచ్ ఆడుతోంది భారత జట్టు. దీంతో రాంఛీకి వచ్చిన భారత ప్లేయర్లను, తన ఇంటికి విందుకి ఆహ్వానించాడు టీమిండియా మాజీ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ. ఈ క్రమంలో విరాట్ కోహ్లిని ధోనీ స్వయంగా తన కారులో ఇంటికి తీసుకెళ్లడం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోను ఫ్యాన్స్ తెగ షేర్ చేస్తున్నారు.వైరల్ అవుతున్న ఈ వీడియోకు ఈ వీడియోకు రీ యూనియన్ ఆఫ్ ది ఇయర్ అని క్యాప్షన్ పెట్టడంతో మరింత హైలెట్ అయింది. విరాట్ కోహ్లి టీ20లతో పాటు టెస్టులకూ గుడ్ బై చెప్పడంతో కేవలం వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నాడు. దాంతో ఫ్యామిలీని పూర్తిగా లండన్‌కు మార్చేసిన కోహ్లి ఎప్పుడైనా వన్డే సిరీస్ ఉంటేనే భారత్‌కు వస్తున్నాడు. సౌతాఫ్రికాతో ఈ నెల 30 నుంచి వన్డే సిరీస్ మొదలవ్వనుండటంతో విరాట్ కోహ్లి భారత్‌కు చేరుకున్నాడు. మొదటి వన్డే ధోనీ సొంతగడ్డ రాంచీలోనే జరగనుంది. దాంతో విరాట్ కోహ్లికి ధోనీ స్వాగతం పలికాడు.




# WPL 2026 షెడ్యూల్‌లో ట్విస్ట్.. ఫస్ట్ టైం సెలవు రోజున కాకుండా ఫైనల్ ఫిక్స్ చేసిన మెనేజ్మెంట్

బీసీసీఐ తాజాగా మహిళా ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ మెగా ఆక్షన్ తర్వాత విడుదలైన షెడ్యూల్‌లో ఒక అంశం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అదేమిటంటే ఈ భారీ లీగ్ ఫైనల్ మ్యాచ్.. సెలవు రోజు కాకుండా, వారంలో వర్కింగ్ డేలో జరగనుంది. బీసీసీఐ తాజాగా మహిళా ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ మెగా ఆక్షన్ తర్వాత విడుదలైన షెడ్యూల్‌లో ఒక అంశం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అదేమిటంటే ఈ భారీ లీగ్ ఫైనల్ మ్యాచ్.. సెలవు రోజు కాకుండా, వారంలో వర్కింగ్ డేలో జరగనుంది. ఎలిమినేటర్ మ్యాచ్ ఫిబ్రవరి 3 (మంగళవారం) నాడు, ఫైనల్ మ్యాచ్ ఫిబ్రవరి 5 (గురువారం) నాడు జరగనున్నాయి. ఈసారి టోర్నమెంట్ కేవలం నవీ ముంబై, వడోదరాలలో మాత్రమే నిర్వహించనున్నారు. మొత్తం 28 రోజుల పాటు జరిగే ఈ డబ్ల్యూఎల్ సీజన్‌లో 22 మ్యాచ్‌లు ఆడతారు. కేవలం రెండు డబుల్ హెడర్ (ఒకే రోజు రెండు మ్యాచ్‌లు) మ్యాచ్‌లు మినహా, మిగిలిన అన్ని మ్యాచ్‌లు సాయంత్రం 7 గంటలకు ప్రారంభమవుతాయి. టోర్నమెంట్ మొదటి భాగం, మొదటి రెండు డబుల్ హెడర్ మ్యాచ్‌లకు నవీ ముంబైలోని



డీవై పాటిల్ స్టేడియం ఆతిథ్యం ఇస్తుంది. ఆ తర్వాత టోర్నమెంట్‌లో రెండో భాగం, ప్లేఆఫ్‌లు, ఫైనల్ మ్యాచ్‌తో సహా అన్నీ వడోదరాలో నిర్వహిస్తారు. డబ్ల్యూపీఎల్ 2026 సీజన్ మొత్తం 28 రోజుల్లో 22 మ్యాచ్‌లతో నవీ ముంబై, వేదికల్లో జరుగుతుంది. టోర్నమెంట్ జనవరి 9, 2026 న ప్రారంభమై, ఫిబ్రవరి 5, 2026 న ముగుస్తుంది.

# ఏంటిది బాసూ!..పంత్‌ను చూసి నవ్వుకున్న కెమెరామెన్..షూటింగ్‌లో కామెడీ ఆఫ్ ది డే

భారత్, సౌతాఫ్రికా మధ్య వన్డే సిరీస్ నవంబర్ 30 నుంచి రాంచీలో ప్రారంభం కానుంది. ఈ కీలకమైన పోరుకు ముందు టీమిండియా ఆటగాళ్లు ఫోటోషూట్‌లో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన సరదా వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ వీడియోలో రిషభ్ పంత్, అర్ష్‌దీప్ సింగ్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సహా ఇతర ఆటగాళ్లు సందడి చేశారు. భారత్, సౌతాఫ్రికా మధ్య వన్డే సిరీస్ నవంబర్ 30 నుంచి రాంచీలో ప్రారంభం కానుంది. ఈ కీలకమైన పోరుకు ముందు టీమిండియా ఆటగాళ్లు ఫోటోషూట్‌లో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన సరదా వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ వీడియోలో రిషభ్ పంత్, అర్ష్‌దీప్ సింగ్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సహా ఇతర ఆటగాళ్లు సందడి చేశారు. అయితే ఈ షూట్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన వ్యక్తి రిషబ్ పంత్. టీమిండియాలోని ఇతర ఆటగాళ్ల మాదిరిగానే రిషబ్ పంత్ కూడా ఫోటోషూట్‌కు వచ్చాడు. పంత్ ఫోటోలు తీస్తుండగా అతని మొహంలో సరిగా చిరునవ్వు లేకపోవడం గమనించిన ఫొటోగ్రాఫర్.. కొంచెం బాగా నవ్వండి అని అడిగాడు. అందుకు పంత్, నేను నిద్రపోతున్నాను. ఇప్పుడే నిద్రలేచి వచ్చానంటూ నవ్వు తెప్పించే ఆన్సర్ ఇచ్చాడు. పంత్ కళ్లలో నిజంగానే నిద్ర మత్తు కనిపిస్తుండటం ఈ వీడియోలో హైలైట్ అయింది. మరోవైపు, ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఉత్సాహంగా కనిపించగా, విరాట్ కోహ్లీ తనదైన



ప్రొఫెషనల్ స్టైల్‌లో ఫోటోలకు పోజులిచ్చాడు. కెప్టెన్ రోహిత్ శర్మ అయితే ఫొటోగ్రాఫర్‌కే ఏ యాంగిల్‌లో ఫోటోలు తీయాలో సూచించడం కనిపించింది.

ఈ సరదా సన్నివేశాలు ఒకవైపు ఉన్నప్పటికీ, టీమిండియాకు ఈ వన్డే సిరీస్ గెలవడం చాలా కీలకం. ఇటీవల సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 0-2 తేడాతో క్లీన్ స్వీప్ అయిన తర్వాత, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్పై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఆయనను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వన్డే సిరీస్‌లోనైనా టీమిండియా మెరుగైన ప్రదర్శన చేయాలని గంభీర్ ఆశిస్తున్నారు. గత వన్డే సిరీస్‌ను కూడా భారత్ ఆస్ట్రేలియా చేతిలో కోల్పోయింది. ఒకవేళ ఈ సిరీస్‌లో కూడా ఓడిపోతే, జట్టుపై, కోచ్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంది.



# గంభీర్ ఎమోషనల్ అయితే కష్టమే..

## ఏబీ డివిలియర్స్ షాకింగ్ కామెంట్స్

సౌతాఫ్రికాతో జరిగిన సొంతగడ్డపై టెస్ట్ సిరీస్‌లో భారత్ 0-2తో వైట్‌వాష్ కావడంతో, శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టెస్ట్ జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ భవిష్యత్తుపై తీవ్ర చర్చ జరుగుతోంది. టీమిండియా అన్ని విభాగాల్లో విఫలమవడంతో, గంభీర్ కోచింగ్ శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సౌతాఫ్రికాతో జరిగిన సొంతగడ్డపై టెస్ట్ సిరీస్‌లో భారత్ 0-2తో వైట్‌వాష్ కావడంతో, శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టెస్ట్ జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ భవిష్యత్తుపై తీవ్ర చర్చ జరుగుతోంది. టీమిండియా అన్ని విభాగాల్లో విఫలమవడంతో, గంభీర్ కోచింగ్ శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా దిగ్గజ ఆటగాడు ఏబీ డివిలియర్స్, రవిచంద్రన్ అశ్విన్‌తో తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆటగాడిగా గంభీర్ ఎమోషనల్ అవతార్ తనకు తెలుసని, కోచ్‌గా కూడా డ్రెస్సింగ్ రూంలో అదే భావోద్వేగాలను కొనసాగిస్తే అది జట్టుకు మంచిది కాదని డివిలియర్స్ బాంబ్ పేల్చారు. సౌతాఫ్రికా తరపున ఆడిన గొప్ప ఆటగాళ్లలో ఒకరైన ఏబీ డివిలియర్స్, కోచ్‌గా గౌతమ్ గంభీర్ నాయకత్వ శైలి గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "భారత జట్టు గురించి చెప్పాలంటే ఇది నిజంగా కష్టం. నాయకత్వ విషయంలో %++% (గౌతమ్ గంభీర్) ఎలా ఉంటారో నాకు తెలియదు. ఆటగాడిగా అతను చాలా ఎమోషనల్ వ్యక్తి అని నాకు తెలుసు. ఒకవేళ డ్రెస్సింగ్ రూమ్‌లో కోచ్‌గా కూడా అతను అదే విధంగా ఎమోషనల్‌గా ఉంటే, అది సాధారణంగా జట్టుకు మంచిది కాదు" అని డివిలియర్స్ అన్నారు. అయితే తెరవెనుక గంభీర్ ఎలాంటి కోచ్ లేదా నాయకుడు అనే విషయం తనకు తెలియదని, ఏది సరైనది, ఏది తప్పు అని చెప్పలేనని కూడా డివిలియర్స్ స్పష్టం చేశారు. కొంతమంది ఆటగాళ్లకు మాజీ ఆటగాడు కోచ్‌గా ఉండటం సౌకర్యంగా ఉంటుంది, మరికొందరికి ఆటకు సంబంధం లేని అనుభవజ్ఞుడైన కోచ్ కంఫర్ట్‌గా ఉంటారని ఆయన వివరించారు. రవిచంద్రన్ అశ్విన్, గంభీర్, సౌతాఫ్రికా కోచ్ శుక్రి కాన్రాడ్?ల విభిన్న కోచింగ్ శైలులే సిరీస్ ఫలితాన్ని ప్రభావితం చేశాయా అని డివిలియర్స్‌ను అడిగారు. "ఇది కష్టమైన ప్రశ్న, ఎందుకంటే నేను శుక్రి కింద ఎప్పుడూ ఆడలేదు అలాగే గౌతమ్ గంభీర్, మోర్నే మోర్కెల్, ర్యాన్ టెన్ డోస్చేట్ ఉన్న భారత డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా నేను లేను. టీమ్‌లో అది గొప్పగా కనిపిస్తుంది, కానీ తెరవెనుక పరిస్థితి ఎలా ఉందో నాకు తెలియదు" అని డివిలియర్స్ చెప్పారు.తాను గ్యారీ కిర్‌స్టన్ వంటి మాజీ ఆటగాడి కింద ఆడటం చాలా ఇష్టమని, ఇది కొందరు ఆటగాళ్లకు ఉత్సాహం ఇస్తుందని డివిలియర్స్ తెలిపారు. భారత జట్టు అన్ని విభాగాల్లో పదేపదే తప్పులు చేయడంతో సౌతాఫ్రికా చేతిలో ఘోరంగా ఓటమి పాలైంది. ఈ ఓటమి నేపథ్యంలో గౌతమ్ గంభీర్ కోచింగ్ శైలి, జట్టు ఎంపికపై నిరంతరంగా విమర్శలు కొనసాగుతున్నాయి.

# హిట్‌మ్యాన్ విధ్వంసం షురూ..3 మ్యాచ్‌లలో 11 రికార్డులు..క్రికెట్ హిస్టరీలోనే బిగ్గెస్ట్ ప్లాన్

హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ మరోసారి మైదానంలోకి దిగడానికి సిద్ధమవుతున్నాడు. నవంబర్ 30 నుంచి ప్రారంభమవుతున్న సౌతాఫ్రికా వన్డే సిరీస్‌లో ఓపెనర్‌గా తనదైన శైలిలో రాణించడానికి రోహిత్ సిద్ధంగా ఉన్నాడు. రాంచీలో ఇప్పటికే తీవ్రంగా ప్రాక్టీస్ చేసిన రోహిత్, ఆస్ట్రేలియాతో జరిగిన గత వన్డే సిరీస్ లాగే ఈ సిరీస్‌లో కూడా మెరుపులు మెరిపించే అవకాశం ఉంది.



హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ మరోసారి మైదానంలోకి దిగడానికి సిద్ధమవుతున్నాడు. నవంబర్ 30 నుంచి ప్రారంభమవుతున్న సౌతాఫ్రికా వన్డే సిరీస్‌లో ఓపెనర్‌గా తనదైన శైలిలో రాణించడానికి రోహిత్ సిద్ధంగా ఉన్నాడు. రాంచీలో ఇప్పటికే తీవ్రంగా ప్రాక్టీస్ చేసిన రోహిత్, ఆస్ట్రేలియాతో జరిగిన గత వన్డే సిరీస్ లాగే ఈ సిరీస్‌లో కూడా మెరుపులు మెరిపించే అవకాశం ఉంది. కేవలం మూడు మ్యాచ్‌ల ఈ వన్డే సిరీస్ రోహిత్ శర్మకు ఎంతో ప్రత్యేకంగా నిలవనుంది. ఎందుకంటే ఈ సిరీస్‌లో ఏకంగా 5 మెయిన్ రికార్డులు, 11 అద్భుతమైన ఘనతలు సాధించే అవకాశం ఉంది. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ రాబోయే సౌతాఫ్రికా వన్డే సిరీస్‌లో ఏకంగా 5 ముఖ్యమైన ప్రపంచ రికార్డులను అధిగమించే అవకాశం ఉంది. ఈ సిరీస్‌లో 98 పరుగులు చేస్తే, రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌లో 20,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాళ్ల జాబితాలో చేరతాడు. అలాగే, వన్డే ఫార్మాట్‌లో అత్యధిక సిక్సర్లు (351) కొట్టిన పాకిస్తాన్ దిగ్గజం షాహిద్ అఫ్రిది రికార్డును బద్దలు కొట్టడానికి రోహిత్‌కు కేవలం 7 సిక్సర్లు మాత్రమే అవసరం. ఓపెనర్‌గా ఇప్పటివరకు 15,787 పరుగులు చేసిన రోహిత్, మరో 213 పరుగులు చేస్తే 16,000 పరుగుల మార్క్‌ను చేరుకుంటాడు. ముఖ్యంగా ఓపెనర్‌గా క్రిస్ గేల్ (338 సిక్సర్లు) రికార్డును అధిగమించడానికి 8 సిక్సర్లు, ఓపెనర్‌గా అత్యధిక వన్డే సెంచరీలు సాధించిన ఏకైక భారతీయుడిగా నిలవడానికి ఒక సెంచరీ అవసరం.ఈ సిరీస్‌లో రోహిత్ శర్మ స్వదేశంలో, సౌతాఫ్రికాపై అనేక అరుదైన ఘనతలు సాధించగలడు. సౌతాఫ్రికా పై మరో 27 పరుగులు చేస్తే, ఆ జట్టుపై 2,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేస్తాడు. అలాగే ఈ జట్టుపై అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డుకు మరో 7 సిక్సర్లు దూరంలో ఉన్నాడు. భారత గడ్డపై వన్డే ఫార్మాట్‌లో 5,000 పరుగులు పూర్తి చేయడానికి రోహిత్‌కు 133 పరుగులు అవసరం.. ఈ ఘనత సాధించిన మూడో భారతీయ ఆటగాడు అవుతాడు.హిట్ మ్యాన్ జట్టు విజయాలలో కూడా తన మార్క్ చూపించబోతున్నాడు. భారత్ గెలిచిన అంతర్జాతీయ మ్యాచ్‌లలో 12,000 పరుగులు పూర్తి చేయడానికి అతనికి కేవలం 30 పరుగులు అవసరం. ఈ ఘనత సాధించిన తొలి ఆసియా ఓపెనర్ అవుతాడు. అంతేకాకుండా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా (%ాజుచీూ%) దేశాలపై వన్డేల్లో 5,000 పరుగులు పూర్తి చేయడానికి రోహిత్ 36 పరుగులు దూరంలో మాత్రమే ఉన్నాడు. ఈ రికార్డులన్నీ ఈ సిరీస్‌ను రోహిత్ శర్మకు ఒక చారిత్రక ఘట్టంగా మార్చనున్నాయి.

# ముంబై ఇండియన్స్ రెడీ.. పాత గెలుపు గుర్రాలే కావాలంటున్న నీతా అంబానీ



రెండుసార్లు మహిళా ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, 2026 సీజన్ కోసం ఒక స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసింది. వేలానికి ముందు ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ముంబై ఇండియన్స్, వేలంలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ అమెలియా కెర్ కోసం ఏకంగా రూ.3 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించింది. రెండుసార్లు మహిళా ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, %బ్రూా% 2026 సీజన్ కోసం ఒక స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసింది. వేలానికి ముందు ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ముంబై ఇండియన్స్, వేలంలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ అమెలియా కెర్ కోసం ఏకంగా రూ.3 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించింది. పాత ఆటగాళ్లైన షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజన సజీవన్ మళ్లీ జట్టులోకి రావడంతో ముంబై జట్టు మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంఛైజీ యజమాని నీతా అంబానీ, తాము గతేడాది జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గత గురువారం (నవంబర్ 27) జరిగిన మహిళా ప్రీమియర్ లీగ్ వేలం గురించి మాట్లాడిన ముంబై ఇండియన్స్ సహ-యజమాని నీతా అంబానీ, వేలం రోజు చాలా ఉత్సాహంగా, కొన్నిసార్లు టెన్షన్‌గా కూడా గడిచిందని అన్నారు. 2025లో ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయడమే తమ ప్రధాన వ్యూహమని ఆమె వెల్లడించారు. కీలకమైన ఆటగాళ్లు తిరిగి జట్టులోకి రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వేలంలో అమెలియా కెర్ తిరిగి జట్టులోకి రావడం అలాగే షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్, సజన సజీవన్, సంస్కృతి గుప్తా వంటి నలుగురు భారతీయ ప్లేయర్లు మళ్లీ రావడం ముంబై ఇండియన్స్‌కు పెద్ద బలం అని ఆమె అన్నారు. అంతేకాకుండా రాహిలా ఫిర్దౌస్, నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ వంటి యువ ప్రతిభావంతులతో పాటు, పూనమ్ ఖేమ్నార్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్, నికోలా కేరీలను కూడా ముంబై ఇండియన్స్ ఫ్యామిలీలోకి స్వాగతించారు. ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు, నాట్ సైవర్-బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి కమలిని వంటి ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. వేలంలో ఇటీవల టీ20 ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన అమెలియా కెర్, ఫాస్ట్ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ తిరిగి రావడం కోర్ టీమ్‌ను మరింత పటిష్టం చేసింది. ప్రపంచ కప్ విజేత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా న్యూఢిల్లీలో జరిగిన వేలానికి హాజరై, వేలం టేబుల్‌పై వ్యూహాలను రచించడంలో కీలక పాత్ర పోషించారు. వేలంలో తన అనుభవం గురించి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. "నేను మొదట్లో కొంచెం కంగారు పడ్డాను, కానీ మేము ప్రణాళిక చేసిన విధానం, అందరి భాగస్వామ్యం నాకు చాలా బాగా నచ్చింది. నీతా అంబానీ ఎప్పుడూ జట్టుకు సపోర్టుగా ఉండి మాకు అండగా నిలుస్తారు. మా పాత సహచరులలో ఎక్కువ మందిని మేము తిరిగి పొందాము. ఇది ఆ ఆటగాళ్లపై జట్టుకు ఉన్న నమ్మకాన్ని చూపుతుంది" అని అన్నారు. ముంబై ఇండియన్స్ విజయాలలో సైకా, సజన, సంస్కృతి వంటి ఇండియన్ ప్లేయర్లు కీలక పాత్ర పోషించారు. వారు టోర్నమెంట్‌లో ఎదుగుతున్న స్టార్ ప్లేయర్‌లుగా నిలిచారు. ముంబై ఇండియన్స్ జట్టు.. అనేక ప్రపంచ కప్‌ల విజేత అయిన నికోలా కేరీ, యువ ఫాస్ట్ బౌలర్ మిల్లీ ఇల్లింగ్‌వర్త్ అనే ఆస్ట్రేలియన్ జోడీని కూడా తమ జట్టులో చేర్చుకుంది. అలాగే యంగ్ ఇండియన్ టాలెంటుకు సపోర్ట్ ఇచ్చే తమ విధానానికి అనుగుణంగా, భారతీయ ఆల్‌రౌండర్‌లు నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠలను కూడా కొనుగోలు చేసింది. వీరిద్దరూ తొలిసారి డబ్ల్యూపీఎల్ లో ఆడనున్నారు.

# స్నానం చేయాలంటే బద్ధకమా? అయితే మీకో గుడ్‌న్యూస్..

## మనిషిని ఉతికే మెషీన్ వచ్చేసింది! ధర ఎంతంటే..?



జపాన్ సైన్స్ కంపెనీ మానవ వాషింగ్ మెషీన్‌ను ఆవిష్కరించింది. మనుషులకు స్నానం చేయించే ఈ యంత్రం మృదువైన నీటి జెట్‌లు, మసాజ్, సంగీతంతో కూడిన స్పా అనుభవాన్ని అందిస్తుంది. ఒసాకా ఎక్స్‌పోలో ప్రదర్శించబడిన ఇది, ప్రజల పని భారాన్ని తగ్గించి, విశ్రాంతిని ఇస్తుంది. మెషీన్లు వచ్చిన తర్వాత అనేక పనులు సులువుగా, వేగంగా పూర్తి అవుతున్నాయి. పైగా మనుషులకి పని భారం బాగా తగ్గించేశాయి. ఇంట్లో చేసే పనులు బట్టలు ఉతకడం, అంట్లుతోమడం, ఇల్లు తుడవడం వంటి పనులు చేసేందుకు మెషీన్లు వచ్చేశాయి. ఇప్పుడు ఏకంగా మనిషికి స్నానం చేయించే మెషీన్ కూడా వచ్చేసింది. జపాన్ అధికారికంగా మానవ వాషింగ్ మెషీన్‌ను ప్రారంభించింది. దీనిలో ఒక వ్యక్తి పడుకుని డోర్ క్లోజ్ చేస్తే క్లీన్ చేస్తుంది. మృదువైన నీటి జెట్‌లు, నురుగు, తేలికపాటి మసాజ్ చేస్తుంది. అలాగే రిలాక్స్ అయ్యేందుకు మ్యూజిక్ కూడా వినిపిస్తుంది. అలాగే హార్ట్ బీర్ రేట్‌ను కూడా డిస్‌ప్లేపై చూపిస్తుంది. దీన్ని స్నానం కంటే స్పా ట్రీట్‌మెంట్‌లా భావించవచ్చు. జపనీస్ కంపెనీ సైన్స్ తయారు చేసిన ఈ మెషీన్, ఇటీవల ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్‌పోలో అందరి దృష్టిని ఆకర్షించింది. సందర్శకులు ఈ నమూనాను ఎంతగానో ఇష్టపడ్డారు, దీనిని వాణిజ్యపరంగా అమ్ముతారా అని అడగడానికి ఒక %ఖూ% రిసార్ట్ కంపెనీ సైన్స్‌ను సంప్రదించింది. ఆ అభ్యర్థన ఆ కంపెనీని చివరకు యంత్రాన్ని ఉత్పత్తిలోకి తీసుకురావడానికి ప్రేరేపించింది. ఆసక్తికరంగా ఈ ఆలోచన పూర్తిగా కొత్తది కాదు. 1970 ఒసాకా ఎక్స్‌పోలో ఇలాంటి హ్యూమన్ వాషింగ్ మెషీన్‌ను ప్రదర్శించారు. మొదటి యూనిట్‌ను ఒసాకాలోని ఒక హోటల్ కొనుగోలు చేసింది. ఇది తన అతిథులకు ప్రత్యేక సేవగా మానవ వాషింగ్ మెషీన్‌ను అందించాలని యోచిస్తోంది. జపాన్‌లోని ప్రధాన ఎలక్ట్రానిక్స్ రిటైల్ చైన్ అయిన యమడా డెంకి మరొక కొనుగోలుదారు, ఈ అరుదైన పరికరం వినియోగదారులను తన దుకాణాలకు ఆకర్షిస్తుందని ఆశిస్తున్నారు. ప్రత్యేకతను కొనసాగించడానికి ఇది దాదాపు 50 యూనిట్లను మాత్రమే ఉత్పత్తి చేస్తుందని సైన్స్ చెబుతోంది. స్థానిక నివేదికల ప్రకారం.. దీని ధర 60 మిలియన్ యెన్లు (సుమారు రూ.3.2 కోట్లు).

# బిజినెస్

## రూ.2 విలువైన స్టాక్ ఐదేళ్లలో రూ.1400..

## లక్ష విలువ ఇప్పుడు రూ.9 కోట్లు!



ఈ టెలివిజన్ నెట్‌వర్క్ లిమిటెడ్ స్టాక్ 1.19 శాతం పెరిగి రూ.1410కి చేరుకుంది. ఆ తర్వాత స్టాక్ రూ.1423 గరిష్ట స్థాయికి చేరుకుంది. అయితే మార్కెట్ ముగిసే వరకు స్టాక్ రూ.1400 వద్ద ఉంది. శ్రీ అధికారి బ్రదర్స్.. స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టే పెట్టుబడిదారులు ఎల్లప్పుడూ మంచి రాబడిని ఇచ్చే స్టాక్‌ల కోసం వెతుకుతారు. మల్టీబ్యాగర్ స్టాక్‌లు పెట్టుబడిదారులకు మంచి రాబడిని ఇస్తాయి. శ్రీ అధికారి బ్రదర్స్ టెలివిజన్ నెట్‌వర్క్ లిమిటెడ్ పెట్టుబడిదారులు మంచి రాబడిని పొందారు. ఐదు సంవత్సరాల క్రితం ఈ కంపెనీ స్టాక్ రూ.2 ఉండేది. నేడు ఈ స్టాక్ రూ.1400కి చేరుకుంది. ఐదు సంవత్సరాల క్రితం ఒక పెట్టుబడిదారుడు ఈ కంపెనీ స్టాక్‌ను రూ.1 లక్షకు కొనుగోలు చేసి ఉంటే దాని విలువ రూ.9.04 కోట్లు ఉండేది. అంటే ఈ స్టాక్ ఐదు సంవత్సరాలలో పెట్టుబడిదారులను లక్షాధికారులను చేసింది. శ్రీ అధికారి బ్రదర్స్ టెలివిజన్ నెట్‌వర్క్ లిమిటెడ్ స్టాక్ 1.19 శాతం పెరిగి రూ.1410కి చేరుకుంది. ఆ తర్వాత స్టాక్ రూ.1423 గరిష్ట స్థాయికి చేరుకుంది. అయితే మార్కెట్ ముగిసే వరకు స్టాక్ రూ.1400 వద్ద ఉంది. శ్రీ అధికారి బ్రదర్స్ టెలివిజన్ నెట్‌వర్క్ స్టాక్ గత 5 సంవత్సరాలలో 93806 శాతం పెరిగింది. గత ఒక నెలలో కంపెనీ షేర్లు 76 శాతం పెరిగాయి. గత ఆరు నెలల్లో ఈ స్టాక్ 139 శాతం పెరిగింది.

మల్టీబ్యాగర్ స్టాక్ శ్రీ అధికారి బ్రదర్స్ టెలివిజన్ నెట్‌వర్క్ బోర్డు సమావేశం నవంబర్ 24న జరిగింది. దీనిలో కంపెనీ తన పేరును మార్చాలని నిర్ణయించింది. ఈ కంపెనీ కొత్త పేరు అక్విలాన్ నెక్సస్ లిమిటెడ్. స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్లు రిస్క్‌కు లోబడి ఉంటాయి. ఇందులో అందించిన సమాచారం అవగాహన కోసం మాత్రమే. ఏవైనా పెట్టుబడులు పెట్టే ముందు నిపుణులను సంప్రదించండి.

# 50, 30, 20.. కేవలం నంబర్స్ కాదు!

## రూ.2 కోట్లు సంపాదించి పెట్టే అద్భుతమైన ఫార్ములా! ఫాలో అయితే తలరాత మారిపోద్ది!



ఆర్థిక క్రమశిక్షణకు 50, 30, 20 నియమం అద్భుతమైన మార్గం. మీ జీతంలో 50 శాతం అవసరాలకు, 30 శాతం కోరికలకు, 20 శాతం పొదుపు, పెట్టుబడికి కేటాయించడం దీని లక్ష్యం. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టి, కాంపౌండింగ్ శక్తితో మీ సంపదను పెంచుకోవచ్చు. డబ్బును పొదుపు చేయడానికి చాలా ఫార్ములాలు ఉన్నాయి. అత్యంత ప్రజాదరణ పొందిన ఫార్ములా 50 30 20. ఈ నియమాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సరిగ్గా అర్థం చేసుకొని, రియల్ లైఫ్‌లో ఇంప్లిమెంట్ చేసుకుంటే మాత్రం మీ తలరాత మారిపోతుంది. ఇంతకీ ఈ 50, 30, 20 ఏంటో వివరంగా తెలుసుకుందాం.. మీ జీతంలో 50 శాతం రోజువారీ నెలవారీ ముఖ్యమైన అవసరాలకు ఖర్చు చేయాలి. ఆఫీసు ప్రయాణ ఖర్చులు, నెలవారీ రేషన్ వంటివి. 30 శాతం మీ అభిరుచులను నెరవేర్చే ఖర్చులను కలిగి ఉంటుంది. ఇందులో ప్రయాణం, షాపింగ్, సినిమాలు చూడటం, రెస్టారెంట్లకు వెళ్లడం మొదలైనవి ఉంటాయి. జీతంలో మిగిలిన 20 శాతం ఆదా చేయడం చాలా ముఖ్యం. ఈ రోజు మీరు డబ్బు ఆదా చేస్తే, అది రేపు భరోసా ఇస్తుంది. ఆ తర్వాత డబ్బే డబ్బుని సంపాదిస్తుంది. కాబట్టి పొదుపు చాలా ముఖ్యం. ఆ పొదుపు చేయాల్సిన 20 శాతం డబ్బును మీరు మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెడితే.. ఫండ్ మేనేజర్ మీ డబ్బును నిర్వహిస్తారు. మార్కెట్ హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పుడు, ఫండ్ మేనేజర్ మీ డబ్బును నిర్వహిస్తారు. ఆ ఫండ్ మేనేజర్ మీ డబ్బును ప్రమాదకర ఆస్తుల నుండి తీసివేసి, మంచి రాబడిని, డబ్బు కోల్పోయే ప్రమాదం తక్కువగా ఉన్న ప్రాంతాలలో పెట్టుబడి పెడతాడు. కాంపౌండింగ్ శక్తి మీ డబ్బును వేగంగా పెంచుతుంది. పొదుపులు, పెట్టుబడులు ఎంత త్వరగా ప్రారంభిస్తే, భవిష్యత్తులో అంత ఎక్కువ సంపదను కూడబెట్టుకోవచ్చు. ఉదాహరణకు 25 సంవత్సరాల వయస్సులో నెలవారీ రూ.5,000 %ూఖ% ప్రారంభిస్తే, 60 సంవత్సరాల వయస్సులో దాదాపు రూ.2.24 కోట్ల కార్పస్ వస్తుంది. సింపుల్‌గా మీకు ఓ రూ.25000 జీతం వస్తుంటే.. అందులో 50 శాతం అంటే రూ.12,500 మీ ఇంటి ఖర్చులకు పెట్టుకోండి, మిగిలిన రూ.12,500లో 30 శాతం రూ.7,500 ఇతర ఖర్చుల కోసం వాడుకోండి. మిగిలిన 20 శాతం అంటే రూ.5,000 పొదుపు చేయండి.

# ఆరోగ్యం- మహాభాగ్యం



## నిద్ర లేవగానే ఇలా చేయండి! షాకింగ్ ఫలితం

మన పూర్వీకులు ఆయుర్వేదంలో ఉపయోగించిన అతి పురాతన, శక్తివంతమైన రెమెడీస్‌లో ఇది ఒకటి. ఉదయం మీ జీర్ణవ్యవస్థను ఉత్తేజపరిచేందుకు నెయ్యి ఒక అద్భుత ఔషధం. అయితే, దీనికి భారతీయ 'గోల్డెన్ స్పైస్' అయిన పసుపును, దాని శక్తిని 200% వరకు పెంచే మిరియాల పొడిని కలిపితే... అది కేవలం ఆరోగ్య పానీయం కాదు, ఒక శక్తివంతమైన ఇమ్యూనిటీ బూస్టర్. ఈ చిన్న మార్పు మీ ఆరోగ్యంపై, ముఖ్యంగా జీర్ణక్రియ రోగనిరోధక శక్తిపై 30 రోజుల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకోవడానికి సిద్ధంగా ఉండండి. నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, షార్ట్-చైన్ ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ప్రేగు గోడలను శాంతపరుస్తాయి, పోషకాల శోషణను ప్రోత్సహిస్తాయి. సున్నితమైన జీర్ణక్రియకు మద్దతు ఇస్తాయి. దీనిని గోరువెచ్చని నీటిలో కలిపి తీసుకుంటే, ఇది జీర్ణకోశానికి దాదాపు లూబ్రికెంట్‌లా పనిచేస్తుంది. దీనివల్ల మలబద్ధకం తగ్గుతుంది, పేగుల గుండా ఆహారం కదలిక మెరుగుపడుతుంది. దీని పోషక గుణాలు శరీరంలోని సహజ నిర్విషీకరణ ప్రక్రియలకు మద్దతు ఇస్తాయి. పసుపు, ముఖ్యంగా దాని క్రియాశీలక సమ్మేళనం అయిన కర్కుమిన్, బలమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. అయితే, కర్కుమిన్ ఒక్కటే శరీరంలో అంత త్వరగా శోషించబడదు. ఈ విషయంలో నల్ల మిరియాలు కీలక పాత్ర పోషిస్తాయి. నల్ల మిరియాల్లోని పైపెరిన్ కర్కుమిన్ శోషణను 200% వరకు పెంచుతుంది. ఆరోగ్యకరమైన కొవ్వులు (నెయ్యి వంటివి) తో పసుపు కలిసినప్పుడు దాని బయోఅవైలబిలిటీ (శరీరం గ్రహించే సామర్థ్యం) మరింత పెరుగుతుంది.

జీర్ణక్రియ మెరుగు: ఉదయం ఈ పానీయం తాగడం వలన జీవక్రియ ప్రేరేపించబడి, రోజు మొత్తం మెరుగైన జీర్ణక్రియకు మద్దతు లభిస్తుంది. ఇది కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది, ప్రేగు కదలికలను పెంచుతుంది, మరియు జీర్ణాశయాన్ని శాంతపరుస్తుంది.

మంట తగ్గుదల: ఈ మిశ్రమం శరీరంలో మంటను తగ్గించడానికి, కీళ్ల ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రోగనిరోధక శక్తి: ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది.

గొంతు ఉపశమనం: తరచుగా జలుబు లేదా గొంతు నొప్పి ఉన్నవారికి ఈ మిశ్రమం ఉపశమనాన్ని అందిస్తుంది. వెచ్చని నీరు ఉపశమనాన్ని ఇస్తే, నెయ్యి గొంతును కప్పి, పసుపు సహజ యాంటీమైక్రోబయల్‌గా పనిచేసి, మిరియాలు రద్దీని తొలగించడానికి సాయపడతాయి. ముఖ్యమైన జాగ్రత్తలుఅయితే, ఈ పానీయం అందరికీ సరిపోకపోవచ్చు. పిత్తాశయ సమస్యలు, తీవ్రమైన అసిడిటీ లేదా జిడ్డుగల చర్మం ఉన్నవారు దీనిని జాగ్రత్తగా లేదా నిపుణుల మార్గదర్శకత్వంలో మాత్రమే తీసుకోవాలి. నెమ్మదిగా జీవక్రియ జరిగే వారిలో నెయ్యి అధికంగా తీసుకోవడం వలన జీర్ణ సమస్యలు రావచ్చు. అదనంగా, పసుపు రక్తాన్ని పలచబరిచే మందులు వంటి కొన్ని మందులతో చర్య జరిపే అవకాశం ఉంది. మోతాదులో తీసుకుంటే, ఈ మిశ్రమం జీర్ణ మద్దతు, మంట నియంత్రణ మరియు రోగనిరోధక శక్తిని పెంచే ప్రయోజనాలను అందిస్తుంది.



## ఈ విత్తనాలు వేస్ట్ అనుకుంటే బోలెడంతా లాస్ మీకే..

### లాభాలు తెలిస్తే ఒక్క గింజ కూడా వదిలిపెట్టరు..

పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అలాగే, కొన్ని రకాల పండ్ల విత్తనాలు కూడా బోలెడన్నీ ప్రయోజనాలు కలిగి ఉంటాయని మీకు తెలుసా..? అందులో పుచ్చకాయ గింజలు కూడా ఒకటి. ఈ పుచ్చకాయ గింజలలో ప్రోటీన్, విటమిన్ బి, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, జింక్ వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరాన్ని అనేక సమస్యల నుండి రక్షించడంలో సహాయపడతాయి. కాబట్టి పుచ్చకాయ గింజలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాం..పుచ్చకాయ గింజల్లో ఉండే మెగ్నీషియం, మంచి కొవ్వులు ఒమేగా-3, ఒమేగా-6 గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. పుచ్చకాయ గింజల్లోని యాంటీ-ఆక్సిడెంట్లు, కొవ్వు ఆమ్లాలు చర్మాన్ని మెరిసేలా చేయడంలో సహాయపడతాయి. పుచ్చకాయ గింజల్లో ఉండే మెగ్నీషియం, మంచి కొవ్వులు ఒమేగా-3, ఒమేగా-6 గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. పుచ్చకాయ గింజల్లోని యాంటీ-ఆక్సిడెంట్లు, కొవ్వు ఆమ్లాలు చర్మాన్ని మెరిసేలా చేయడంలో సహాయపడతాయి.పుచ్చకాయ గింజల్లో మంచి మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. పుచ్చకాయ గింజలలో ఉండే మెగ్నీషియం, ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. పుచ్చకాయ గింజల్లో మంచి మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. పుచ్చకాయ గింజలలో ఉండే మెగ్నీషియం, ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి.పుచ్చకాయ గింజలు శక్తిని పెంచుతాయి. ఇవి రోజంతా మిమ్మల్ని చురుకుగా ఉంచడంలో సహాయపడతాయి. వీటిలో ఉండే జింక్, మెగ్నీషియం శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. బలమైన రోగనిరోధక శక్తి శరీరాన్ని అనేక ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది.పుచ్చకాయ గింజలు శక్తిని పెంచుతాయి. ఇవి రోజంతా మిమ్మల్ని చురుకుగా ఉంచడంలో సహాయపడతాయి. వీటిలో ఉండే జింక్, మెగ్నీషియం శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. బలమైన రోగనిరోధక శక్తి శరీరాన్ని అనేక ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది.పుచ్చకాయ గింజల్లో కేలరీలు చాలా తక్కువ. బరువు తగ్గడానికి చాలా సహాయపడుతుంది. మరోవైపు, శరీరానికి అవసరమైన రాగి, జింక్, పొటాషియం, మెగ్నీషియం , ఐరన్ వంటి ఖనిజాలు , పోషకాలు ఉన్నాయి. దీంతో శరీరంలో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.పుచ్చకాయ గింజల్లో కేలరీలు చాలా తక్కువ. బరువు తగ్గడానికి చాలా సహాయపడుతుంది. మరోవైపు, శరీరానికి అవసరమైన రాగి, జింక్, పొటాషియం, మెగ్నీషియం , ఐరన్ వంటి ఖనిజాలు , పోషకాలు ఉన్నాయి. దీంతో శరీరంలో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.పుచ్చకాయ గింజల్లోఅధిక స్థాయి మెగ్నీషియం ఉంటుంది. ఇది అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడబడుతుంది. ఇందులో ఉండే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, జింక్, ఫోలేట్, పొటాషియం, రాగి సహజ మల్టీవిటమిన్‌గా పనిచేస్తాయి.పుచ్చకాయ గింజల్లోఅధిక స్థాయి మెగ్నీషియం ఉంటుంది. ఇది అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడబడుతుంది. ఇందులో ఉండే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, జింక్, ఫోలేట్, పొటాషియం, రాగి సహజ మల్టీవిటమిన్‌గా పనిచేస్తాయి.

# కీర్తికి సక్సెస్ దక్కేదెప్పుడు?

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ ఈ మధ్య వరుస ఫ్లాపులను ఎదుర్కొంటుంది. గత కొన్నాళ్లుగా కీర్తి నుంచి వచ్చిన ఏ సినిమాలూ తెలుగులో పెద్దగా ఆడటం లేదు. రీసెంట్ గా కీర్తి నటించిన రివాల్వర్ రీటా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మంచి అంచనాలతో రిలీజైన రివాల్వర్ రీటా కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయింది. స్వయంగా కీర్తి సురేష్ ఈ చిత్ర ప్రమోషన్స్ లో పాల్గొని సినిమాను ప్రమోట్ చేసినప్పటికీ అది కూడా ఏ మాత్రం మెరుగైన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఇంకా చెప్పాలంటే చాలా మందికి అసలు ఆ సినిమా ఒకటి రిలీజైంది అని కూడా తెలియదు. దానికి తోడు సినిమాలో కంటెంట్ కూడా పెద్దగా క్లిక్ అవకపోవడంతో రివాల్వర్ రీటా మొదటి రోజే డిజాస్టర్ గా నిలిచింది.రివాల్వర్ రీటా రిజల్ట్ తో కీర్తి మరోసారి తన ఖాతాలో ఫ్లాపును వేసుకుంది. దీంతో కీర్తి తనకు సక్సెస్ ఎప్పుడెప్పుడొస్తుందా అని ఎదురుచూస్తోంది. మొన్నామధ్య కీర్తి తెలుగులో చేసిన ఉప్పు కప్పురంబు సినిమా కూడా డైరెక్ట్ గా ఓటీటీలో రిలీజవగా, అది కూడా అంచనాలను అందుకోలేకపోయింది. ఇక రఘుతాత మూవీ కూడా అంతే, సినిమా కూడా ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది.కాగా కీర్తి భోళాశంకర్ తర్వాత తెలుగులో డైరెక్ట్ సినిమాలు చేసింది లేదు. పెళ్లి తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న కీర్తి సురేష్ ఇప్పుడా గ్యాప్ ను పూరించాలని వరుస సినిమాలను లైన్ లో పెట్టి అందులో భాగంగానే రివాల్వర్ రీటాను ఆడియన్స్ ముందుకు తీసుకొస్తే, అది కాస్తా ఫ్లాపుగా నిలిచింది. ప్రస్తుతం కీర్తి విజయ్ దేవరకొండ సరసన దిల్ రాజు బ్యానర్ లో ఓ సినిమాను చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమా అయినా కీర్తికి మంచి సక్సెస్ ను అందిస్తుందేమో చూడాలి.



# అక్కడ ఫ్యామిలీ మ్యాన్ తర్వాత కాంతార1కే స్థానం



ఇండియన్ సినీ వరల్డ్ లో సత్తా చాటిన కాంతార చాప్టర్1 ఇప్పుడు మరోసారి వార్తల్లోకెక్కింది. రిషబ్ శెట్టి దర్శకత్వం వహిస్తూ నటించిన ఈ సినిమా కాంతార మూవీకి ప్రీక్వెల్ గా రూపొందింది. అన్ని రకాల ఆడియన్స్ ను అలరించి బాక్సాఫీస్ వద్ద భారీ సక్సెస్ ను అందుకున్న కాంతార1 రిలీజ్ తోనే దేశవ్యాప్తంగా రూ.800 కోట్లకు పైగా కలెక్షన్లను అందుకోవడమే కాకుండా కెజిఎఫ్2 తర్వాత కన్నడ ఇండస్ట్రీలో రెండో అతి భారీ హిట్ గా నిలిచింది.ఆడియన్స్ తో పాటూ క్రిటిక్స్ నుంచి కూడా ప్రశంసలందుకున్న కాంతార1 అక్టోబర్ 31 నుంచే ఓటీటీలో అందుబాటులోకి వచ్చింది. కాంతార1 తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ వెర్షన్లు అక్టోబర్ 31 నుంచే ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కు రాగా, హిందీ వెర్షన్ మాత్రం కాస్త ఆలస్యంగా ఓటీటీలో రిలీజైంది. మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రూల్స్ ప్రకారం హిందీ వెర్షన్ థియేట్రికల్ రిలీజ్ తర్వాత కనీసం 8 వారాలైనా పూర్తవాలి.రీసెంట్ గా గురువారం నుంచి కాంతార చాప్టర్1 హిందీ వెర్షన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి రాగా, ఈ మూవీ రిలీజైన రెండు రోజుల్లోనే డబ్బింగ్ వెర్షన్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ యొక్క ఇండియన్ చార్ట్స్ లో టాప్2 ప్లేస్ ను దక్కించుకుని మరోసారి కాంతార1 వార్తల్లో నిలిచింది. ఈ చార్ట్స్ లో మనోజ్ బాజ్‌పాయి నటించిన సెన్సేషనల్ సిరీస్ ది ఫ్యామిలీ మ్యాన్3 మొదటి ప్లేస్ లో ఉంది.కాంతార చాప్టర్1 లోని దేవతారాధన, గ్రామీణ సంప్రదాయాలు, అటవీ సంస్కృతి, యాక్షన్ సీన్స్ సినిమాను నెక్ట్స్ లెవెల్ కు చేర్చగా ఈ సీన్స్ అన్నీ నార్త్ ఆడియన్స్ కు విపరీతంగా నచ్చాయి. రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటించిన ఈ మూవీని హొంబలే ఫిల్మ్స్ సంస్థ భారీ బడ్జెట్ తో నిర్మించగా, అజనీష్ లోకనాథ్ సంగీతం అందించారు. ఏదేమైనా సినిమాలో మంచి కంటెంట్ ఉంటే కేవలం బాక్సాఫీస్ వద్దే కాకుండా ఓటీటీ తో కూడా సెన్సేషన్ సృష్టించొచ్చని కాంతార1 ప్రూవ్ చేసింది.

# ఇదే ప్లానింగ్ మాస్ రాజా.. కొడుకు కూతురు ఇద్దరినీ..!



స్టార్ హీరో తనయుడు సినీ తెరంగేట్రం అన్నది కామన్. ఐతే మాస్ మహారాజ్ మాత్రం తన వారసులను డిఫరెంట్ గా ఇంట్రడ్యూస్ చేయబోతున్నాడు. ఆల్రెడీ మహాధన్ రవితేజ రాజా ది గ్రేట్ సినిమాలో డెబ్యూ ఇచ్చాడు. ఆ సినిమాలో అతని స్క్రీన్ ప్రెజెన్స్ రవితేజ ఎనర్జీని మ్యాచ్ చేసేలా మాస్ రాజా ఫ్యాన్స్ ని మెప్పించాడు. ఐతే ఆ సినిమా తర్వాత సినిమాను టెక్నికల్ గా అర్థం చేసుకునేందుకు %ూణ%గా అదే అసిస్టెంట్ డైరెక్టర్ గా చేస్తున్నాడు మహాధన్. ఆల్రెడీ వెంకీ అట్లూరి సూర్య కాంబినేషన్ సినిమాకు మహధాన్ పనిచేస్తున్నాడు.మహధాన్ అసిస్టెంట్ డైరెక్టర్ గా..రీసెంట్ గా సందీప్ వంగ ప్రభాస్ కాంబోలో తెరకెక్కుతున్న స్పిరిట్ సినిమాకు కూడా మహాధన్ అసిస్టెంట్ డైరెక్టర్ గా చేస్తున్నాడట. సో తనయుడిని కూడా తన బాటలోనే ముందు సినిమాను అర్థం చేసుకుని తర్వాత ఎంట్రీ ఇప్పించే ఏర్పాటు చేస్తున్నాడు రవితేజ. ఐతే మహాధన్ హీరోగా చేస్తాడా లేదా డైరెక్టర్ గా కొనసాగుతాడా అన్నది మాత్రం కొన్నాళ్ల తర్వాత తెలుస్తుంది.ఇక రవితేజ తనయుడే కాదు కూతురు మోక్షధ కూడా సినిమాల్లోకి వస్తుంది. ఐతే ఆమె నిర్మాతగా తన సత్తా చాటాలని చూస్తుంది. అందుకే రవితేజ బ్యానర్ బాధ్యతలను దగ్గర ఉండి చూసుకుంటుంది. త్వరలో రవితేజ శివ నిర్వాణ కాంబినేషన్ లో రాబోతున్న సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా మోక్షధ వ్యవహరిస్తుందట. సో రవితేజ సినిమాలకు మోక్షధ ఎగ్జిక్యూటివ్ గా కొనసాగే ఛాన్స్ కనిపిస్తుంది.తనకు లైఫ్ ఇచ్చిన సినిమాల్లోనే.. తన లైఫ్ అయిన తనయుడు, తనయురాలు..ఇలా నిర్మాణంలో కొంత ఎక్స్ పీరియన్స్ వచ్చాక సొంతంగా సినిమాలు నిర్మించే అవకాశం ఉంది. మొత్తానికి తనకు లైఫ్ ఇచ్చిన సినిమాల్లోనే తన లైఫ్ అయిన తనయుడు మహాధన్, తనయురాలు మోక్షధ లను కూడా తీసుకొచ్చారు రవితేజ. ఐతే సినిమాల మీద వారికి ఆసక్తి ఉండటం వల్లే ఎలాంటి ఫోర్స్ లేకుండా రవితేజ వారిని వారికి ఆసక్తి ఉన్న విభాగాల్లో ఎంకరేజ్ చేస్తున్నారని చెప్పొచ్చు. ఐతే మహాధన్ డైరెక్టర్ ఏంటి మాస్ రాజా లెగసీని కొనసాగించాలి కదా హీరోగా ఎప్పుడు మారతాడని ఫ్యాన్స్ ఇప్పటికే హడావిడి చేయడం మొదలు పెట్టారు.రవితేజ ప్లానింగ్ ఏంటో కానీ మహాధన్ సందీప్ వంగ, వెంకీ అట్లూరి లాంటి డైరెక్టర్స్ దగ్గర పనిచేయడంతో అతను కూడా మంచి సినిమా ఎక్స్ పీరియన్స్ పొందే ఛాన్స్ ఉంటుంది. రవితేజ సినిమాల విషయానికి వస్తే కిషోర్ తిరుమల డైరెక్షన్ లో భక్తమహాశయులకు విజ్ఞప్తి సినిమా చేస్తున్న రవితేజ ఆ మూవీతో సంక్రాంతి బరిలోకి వస్తున్నారు. నెక్ట్స్ శివ నిర్వాణతో ఒక క్రైమ్ థ్రిల్లర్ మూవీ ప్లానింగ్ ఉంది.




Prajajwala Telugu Daily : Printer, Publisher and Owned by APPIKONDA BHAVANI ,[LATE] A.BHASKAR RAO, Head Office: Vizag, T.S.Branch Office Address: plot no: 204, Road No:7 venus Rocks Heights, Devendra Nagar-Gajularamaram Quthbullapur, Hyderabad- 500055: prajajwalatelangana@gmail.com cell. no. 9700070315, RNI No. APTEL 2010/33400.

## అప్పుడు ఎట్లున్న తెలంగాణ

# ఇప్పుడేట్లయితుంది



## రెండున్నర ఏళ్ళ కాంగ్రెస్ పాలనలో ఆగమైతున్న ప్రజల బతుకులు..

**అడుగడుగున అవమానాలు, వివక్షతకు గురైన తెలంగాణ**

**కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర సాధన పోరాటంతో ఆవిర్భవించిన రాష్ట్రం**

**తెలంగాణను పదేళ్ల కాలంలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన నేత**

**తెలంగాణ దార్శనికులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రమే**

**నాడు తెలంగాణ రాష్ట్రం కోసం తమ పదవులను త్యజించిన నైజం**

**కేసీఆర్ ను మరోసారి సీఎం చేసేంత వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త దీక్షగా పనిచేయాలి**

**ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కెపి వివేకానంద్**







కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల: అడుగడుగున అవమానాలు, వివక్షతకు గురైన తెలంగాణ ప్రాంతం ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా కేసీఆర్ చేసిన పోరాట ఫలితంగా ఆవిర్భవించినది తెలంగాణ రాష్ట్రం. కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల కాలంలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన దార్శనికులు, నాడు తెలంగాణ రాష్ట్రం కోసం తమ పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసిన గొప్ప నాయకులు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని, మరోమారు గొప్పనాయకుడినే ముఖ్యమంత్రి చేయాలని ప్రతి నాయకుడు, కార్యకర్త దీక్షగా పనిచేయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ పిలుపునిచ్చారు.

### మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివాస్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన "దీక్షా దివాస్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ తో పాటుగా ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ లు పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధకులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడుగడుగున అవమానాలు, వివక్షతకు గురైన ఈ ప్రాంతం ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా ఆవిర్భవించిన తెలంగాణను పదేళ్ల కాలంలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన దార్శనికులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. నాడు తెలంగాణ రాష్ట్రం కోసం తమ పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసిన గొప్ప నాయకులు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తీరును, ఉద్యమ పంథాను నేటి యువతకు తెలియజేయాలన్నారు. రానున్న తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో కేసీఆర్ ని మరోమారు సీఎం చేసే వరకు ప్రతీ నాయకుడు, కార్యకర్త ఒక దీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.











